



# పెన్ పవర్



తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 11 సంచిక : 340 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం గురువారం 14 ఆగస్టు 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE :340 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM THU 14 AUGUST 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur







# ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం వేసే ప్రసక్తే లేదు

- ఏపీని 'గ్రీన్ ఎనర్జీ కారిడార్'గా తీర్చిదిద్దుతామన్న చంద్రబాబు
- వినియోగదారులపై విద్యుత్ ఛార్జీల భారం వేయొద్దని అధికారులకు ఆదేశం
- ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలపై దృష్టి సారించాలని కీలక సూచన
- పంపిణీ నష్టాలు, బహిరంగ మార్కెట్ కొనుగోళ్లు తగ్గించాలని స్పష్టం
- వ్యవసాయానికి స్మార్ట్ మీటర్లు వద్దని తేల్చిచెప్పిన ముఖ్యమంత్రి



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌ను 'గ్రీన్ ఎనర్జీ కారిడార్'గా తీర్చిదిద్దాలని, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అదే సమయంలో, విద్యుత్ ఛార్జీలు పెంచి వినియోగదారులపై ఎలాంటి భారం మోపవద్దని ఆయన స్పష్టం చేశారు. బుధవారం అమరావతిలోని తన క్యాంపు కార్యాలయంలో విద్యుత్ సరఫరా, పెట్టుబడులు, ఛార్జీల తగ్గింపు వంటి కీలక అంశాలపై సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఏపీ ట్రాన్స్‌కో, జెన్‌కో ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రాష్ట్ర విద్యుత్ రంగంలో స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. "భవిష్యత్ అంతా గ్రీన్ ఎనర్జీదే. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించి, ఆ ప్రయోజనాలను ప్రజలకు అందించాలి," అని ఆయన పేర్కొన్నారు. రాబోయే రెండు, మూడేళ్లలో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం 8.9% పెరిగే అవకాశం ఉందని, ఈ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిని పెంచాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి ఆధునిక సాంకేతికతను ఉపయోగించి అతి తక్కువ ఖర్చుతో విద్యుత్ ఉత్పత్తి చేసే మార్గాలను అన్వేషించాలని అన్నారు.

**ఛార్జీల భారం వద్దు.. ప్రత్యామ్నాయ ఆదాయంపై దృష్టి**

వినియోగదారులపై విద్యుత్ ఛార్జీల భారం వేసే ప్రసక్తే లేదని తేల్చిచెప్పిన సీఎం, ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను అన్వేషించాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం ఏపీ ట్రాన్స్‌కో ఆధీనంలో ఉన్న ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్‌ను లీజుకు ఇవ్వడం ద్వారా అదనపు ఆదాయం సంపాదించవచ్చని తెలిపారు. ఈ విధానం ద్వారా దాదాపు రూ.7 వేల కోట్ల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందని అంచనా వేశారు. బహిరంగ మార్కెట్‌లో విద్యుత్ కొనుగోళ్లను గణనీయంగా తగ్గించాలని, యూనిట్ కొనుగోలు వ్యయాన్ని రూ.4.80కి

వివరాలు 2లో..

## ఓటమి భయంతోనే టీడీపీ అరాచకాలు..

### పులివెందుల ఘటనలపై జగన్



- పులివెందుల జడ్పీటీసీ ఉపఎన్నికపై వైఎస్ జగన్ తీవ్ర ఆరోపణలు
- టీడీపీ నేతలు దౌర్జన్యాలకు పాల్పడ్డారంటూ కొన్ని వీడియోల ప్రదర్శన
- 'కాల్చి పారేస్తా' అంటూ డీఎస్పీ బెదిరించారని విమర్శ
- మంత్రి రామప్రసాద్ రెడ్డి బూత్‌లోకి వెళ్లి ఏజెంట్లపై దాడి చేశారని ఆరోపణ
- ఓటమి భయంతోనే టీడీపీ అక్రమాలకు పాల్పడుతోందని జగన్ వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:పులివెందుల జడ్పీటీసీ ఉపఎన్నిక సందర్భంగా అధికార తెలుగుదేశం పార్టీ అక్రమాలకు, దౌర్జన్యాలకు పాల్పడిందని వైసీపీ అధినేత వైఎస్ జగన్ తీవ్రస్థాయిలో ఆరోపించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఎన్నికల్లో గెలవడం కోసం టీడీపీ నేతలు పోలీసులను, మంత్రులను అడ్డం పెట్టుకుని రౌడీయిజం చేస్తున్నారని విమర్శించారు. ఈ ఘటనలకు సంబంధించిన కొన్ని

వివరాలు 2లో..

## సిట్ సీజ్ చేసిన రూ. 11 కోట్లపై నాకు అనుమానాలు ఉన్నాయి



వివరాలు 2లో..

- లిక్కర్ స్కామ్ నిందితులను రిమాండ్ పొడిగించిన కోర్టు
- కాల్ డేటా రికార్డులను స్వచ్ఛంద సంస్థతో విచారణ జరిపించాలన్న కసిరెడ్డి
- సిట్ ఆధారాలను ధ్వంసం చేస్తోందని మండిపాటు

## కొత్త జిల్లాల ఏర్పాటుపై వినతులు స్వీకరిస్తాం



- జిల్లాల ఏర్పాటును గత ప్రభుత్వం అస్తవ్యస్తంగా చేపట్టిందన్న అనగాని
- సమస్యలను పరిష్కరించేందుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసినట్టు వెల్లడి
- మంత్రులు రెండు గ్రూపులుగా విడిపోయి జిల్లాల్లో పర్యటిస్తామన్న మంత్రి

వివరాలు 2లో..

## రీపోలింగ్ ను బహిష్కరిస్తున్నాం

- పులివెందులలో రెండు బూత్ లలో రీపోలింగ్
- అన్ని బూత్ లలో అవకతవకలు జరిగాయన్న అవినాశ్
- కేంద్ర బలగాలతో రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్



పెన్ పవర్ డెస్క్:పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికకు సంబంధించి రెండు బూత్ లలో ఉప ఎన్నిక జరుగుతోంది. మొన్న జరిగిన పోలింగ్ సందర్భంగా అవకతవకలు జరిగాయంటూ వైసీపీ ఫిర్యాదు చేయడంలో రెండు బూత్ లలో ఎన్నికల సంఘం ఆదేశాల

వివరాలు 2లో..

## వంగి కొబ్బరికాయ కొట్టలేని జగన్.. చంద్రబాబు వయసు గురించి మాట్లాడడమా?

- పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలపై టీడీపీ, వైసీపీ మధ్య మాటల యుద్ధం
- జగన్ పై సోమిరెడ్డి ఫైర్
- జగన్ రెడ్డి ఒళ్లు బలిసి మాట్లాడుతున్నారని విమర్శలు
- ఒళ్లు బలిసిన వారి సంగతిని లోకేశ్ చూసుకుంటారని వ్యాఖ్యలు

వివరాలు 2లో..



## ఏపీ ఎన్నికలపై జగన్ వ్యాఖ్యలు.. తీవ్రంగా స్పందించిన తెలంగాణ కాంగ్రెస్ ఎంపీ

- ఏపీ ఎన్నికలపై రాహుల్ గాంధీ మాట్లాడలేదన్న జగన్
- చంద్రబాబు, రేవంత్ రెడ్డిల కారణంగానే మాట్లాడలేదని విమర్శ
- అలాంటి వ్యాఖ్యలు సరికాదన్న చామల కిరణ్ కుమార్ రెడ్డి

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ఎన్నికలపై రాహుల్ గాంధీ మాట్లాడలేదంటూ ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పందించారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిలపై జగన్ చేసిన వ్యాఖ్యలు సరికాదని అన్నారు. చంద్రబాబు, రేవంత్ రెడ్డి వల్లే రాహుల్ మాట్లాడలేదని ఆరోపించడం సముచితం కాదన్నారు. ఎన్నికల్లో

వివరాలు 2లో..



## 79వ స్వాతంత్ర్య దినోత్సవం: నేడు జాతినుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం

- 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రేపు జాతినుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం
- ఎల్లుండి ఎర్రకోట నుంచి ప్రసంగించనున్న ప్రధాని నరేంద్ర మోదీ
- దేశ రాజధాని ఢిల్లీలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు
- పలు కీలక ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధింపు
- ఉదయం 4 గంటల నుంచే మెట్రో ప్రత్యేక సర్వీసులు
- సాయుధ బలగాల బ్యాండ్ ప్రదర్శనలతో దేశభక్తి వాతావరణం


పెన్ పవర్ డెస్క్:దేశవ్యాప్తంగా 79వ స్వాతంత్ర్య దినో త్సవ వేడుకలకు సర్వం సిద్ధమైంది. ఈ వేడుకలను పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం (ఆగస్టు 14) జాతినుద్దేశించి ప్రసంగిం చనున్నారు. సాయంత్రం 7 గంటలకు

వివరాలు 2లో..



## పులివెందుల, ఒంటిమిట్ట ఉపఎన్నికల రగడ..

### వైసీపీపై ఎస్ఈసీకి ఫిర్యాదు చేసిన టీడీపీ నేతలు



- ఒంటిమిట్ట, పులివెందుల ఉపఎన్నికలపై తీవ్ర దుమారం
- వైసీపీ నేతలు పోలీసులను బెదిరించారని టీడీపీ ఆరోపణ
- రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను కలిసి ఫిర్యాదు చేసిన టీడీపీ బృందం
- దౌర్జన్యానికి పాల్పడ్డ వైసీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- జగన్ పాలనపై టీడీపీ నేతలు వర్ల రామయ్య, దేవినేని ఉమ తీవ్ర విమర్శలు
- మూడు దశాబ్దాల తర్వాత స్వేచ్ఛగా ఓటేశారన్న దేవినేని ఉమ

వివరాలు 2లో..

## జగన్... నేను దేని గురించి మాట్లాడుతున్నానో మీకు బాగా తెలుసు!

- జగన్ 'ఓట్ల చోరీ' ఆరోపణలను తిప్పికొట్టిన మంత్రి నారా లోకేశ్
- 'నోట్ల చోరీ' వల్లే వైసీపీ ఓటమి పాలైందని ఘాటు విమర్శ
- తమకు ప్రజలతోనే అసలైన 'హాట్‌లైన్' ఉందని స్పష్టీకరణ
- మోదీ, చంద్రబాబు నాయకత్వంలో ఏపీకి తిరిగి అగ్రస్థానం
- డబుల్ ఇంజిన్ సర్కార్‌తో రాష్ట్ర ప్రగతి ఖాయమని ధీమా

పెన్ పవర్ డెస్క్:వైసీపీ అధ్యక్షుడు జగన్ చేస్తున్న 'ఓట్ల చోరీ' ఆరోపణలపై రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్ర స్థాయిలో స్పందించారు.

వివరాలు 2లో..



## భారత్-రష్యా మైత్రి.. మాస్కోలో జైశంకర్, లావ్రోవ్ కీలక భేటీ

- మాస్కోలో జైశంకర్, లావ్రోవ్ భేటీకి రంగం సిద్ధం
- ఆగస్టు 21న జరగనున్న కీలక సమావేశం
- ద్వైపాక్షిక, అంతర్జాతీయ అంశాలపై చర్చలు
- ఇటీవలే ముగిసిన అజిత్ దోవల్ రష్యా పర్యటన
- కొనసాగుతున్న ఇరు దేశాల మధ్య ఉన్నత స్థాయి చర్చలు
- భారత్‌కు రానున్న రష్యా అధ్యక్షుడు పుతిన్



వివరాలు 2లో..

## లోకేశ్ నియోజకవర్గంలో సందడి చేసిన నారా బ్రాహ్మణి...

- మంత్రి లోకేశ్ నియోజకవర్గం మంగళగిరిలో నారా బ్రాహ్మణి పర్యటన
- చేనేత చీరల సరికొత్త డిజైన్లను ఆసక్తిగా పరిశీలించిన బ్రాహ్మణి
- కాజలోని కుట్టు శిక్షణా కేంద్రంలో మహిళలతో ముచ్చట్లు
- చిన్నారుల పార్కును సందర్శించి సరదాగా ఉయ్యాల ఊగిన వైనం
- లోకేశ్ ఏర్పాటు చేసిన ఉచిత బస్సు సౌకర్యంపై భక్తుల నుంచి ఆరా




పెన్ పవర్ డెస్క్:రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ అర్ధాంగి నారా బ్రాహ్మణి నేడు మంగళగిరి నియోజకవర్గంలో మంగళవారం విస్తృతంగా పర్యటించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఆమె స్వయంగా పరిశీలించి, స్థానికులతో మమేకమయ్యారు. ఈ పర్యటనలో భాగంగా ఆమె నియోజకవర్గంలోని పలు ప్రాంతాలను సందర్శించారు. ముందుగా, మంగళగిరి చేనేత వస్త్రాలకు ఉన్న ప్రత్యేకతను దృష్టిలో ఉంచుకుని, అక్కడి కార్మికులు రూపొందించిన సరికొత్త డిజైన్లను ఆమె ఆసక్తిగా తిలకించారు. చేనేత కళాకారుల నైపుణ్యాన్ని అభినందించారు. అనంతరం కాజలో ఏర్పాటు చేసిన స్త్రీ శక్తి కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాన్ని సందర్శించారు.

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# డెంగీ కంగారొద్దు

వానాకాలం రాగానే దోమలు విజృంభిస్తుంటాయి. వీటితో పాటే జ్వరాలూ చెలరేగుతుంటాయి. వీటిల్లో డెంగీ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఎందుకంటే చాలామంది ప్లేట్‌లెట్ల గురించి తీవ్ర ఆందోళన చెందుతుంటారు. నిజానికి అంత కంగారు అవసరం లేదు. అందరికీ ప్లేట్‌లెట్లు ఎక్కించాల్సిన అవసరం రాదు. చాలావరకూ మామూలు చికిత్సతోనే జ్వరం తగ్గుతుంది. కాబట్టి డెంగీ తీరుతెన్నులు, చికిత్స, నివారణ మీద సరైన అవగాహన కలిగుండటం తప్పనిసరి.

**ఒక రకంతో ఒకసారే కానీ..**

ఈడిస్ జాతి దోమలు కుట్టటం ద్వారా డెంగీ వైరస్‌లు వ్యాపిస్తాయి. దోమ కుట్టిన 3-14 రోజుల్లో ఎప్పుడైనా ఇన్‌ఫెక్షన్ తలెత్తొచ్చు. ఈ వైరస్‌లలో ప్రధానంగా నాలుగు రకాలున్నాయి. ఒక రకంతో ఒకసారే ఇన్‌ఫెక్షన్ వస్తుంది. అయితే మరో రకం వైరస్‌తో రెండోసారి వస్తే తీవ్రంగా ఉంటుంది. మొదటి రకం వైరస్‌ను ఎదుర్కోవటానికి పుట్టుకొచ్చిన యాంటీబాడీలు రెండో రకం వైరస్‌ను కణాల్లోంచి నిర్మూలించ లేవు. దీంతో ఇన్‌ఫెక్షన్ చాలా తీవ్రంగా ఉంటుంది. కాబట్టే తగు జాగ్రత్త అవసరం. ఎవరికైనా నాలుగు వైరస్‌లతో నాలుగు సార్లు డెంగీ వస్తే జీవితంలో మళ్లీ ఎప్పుడూ వచ్చే అవకాశమే ఉండదని చెప్పుకోవచ్చు.

**మామూలు చికిత్సతోనే**

ఒక మాదిరి డెంగీ జ్వరానికి పారాసిటమాల్ మాత్రలే సరిపోతాయి. అలాగే ఓఆర్‌ఎస్ పొడి కలిపిన నీళ్లు తాగుతుండాలి. వాంతులవుతుంటే వీటిని తగ్గించే మందులూ అవసరం. చాలామందికి దీంతోనే డెంగీ నయమవుతుంది.

**ఆసుపత్రిలో ఎప్పుడు?**

మామూలు చికిత్సతో తగ్గకపోయినా, తీవ్ర డెంగీ లక్షణాలు కనిపిస్తున్నా ఆసుపత్రిలో చేర్చి, చికిత్స చేయాలి. రక్తం చిక్కబడటంతో డెంగీ తీవ్రదశ మొదలవుతుంది. ఇది సాధారణంగా 24-48 గంటల వరకూ కొనసాగుతుంది. ఆ తర్వాత దానంతటదే కుదురుకుంటుంది. కానీ కొందరికి గంటల్లోనే పరిస్థితి విషమించొచ్చు. కాబట్టి రక్తం చిక్కదనాన్ని తెలిపే హిమటోక్రిట్/ప్యాక్డ్ సెల్ వాల్యూమ్, ప్లేట్‌లెట్ల సంఖ్యను తెలిపే రక్త పరీక్షలు తరచూ చేస్తూ జాగ్రత్తగా కనిపెట్టుకోవాల్సి ఉంటుంది. ఊపిరితిత్తుల్లోకి ప్లాస్మా ద్రవం లీకై, ఆయాసం వస్తుంటే వెంటిలేటర్ అమర్చి చికిత్స చేయాల్సి ఉంటుంది.

**ప్లేట్‌లెట్లు పడిపోయినా..**

ప్లేట్‌లెట్లు 40 వేలకు, 30 వేలకు పడిపోయా యని అతిగా గాబరా పడొద్దు, భయపడొద్దు. ఎందుకంటే డెంగీలో ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గటం వల్ల మరణించటం చాలా అరుదు. అందరికీ వీటిని ఎక్కించాల్సిన అవసరం లేదు.

ప్లేట్‌లెట్ల సంఖ్య లక్ష కన్నా తగ్గినప్పుడు డాక్టర్ల పర్యవేక్షణలో ఉండాలి. 50వేల కన్నా తక్కువకు పడిపోతే నిశితంగా గమనిస్తూ ఉండటం ముఖ్యం.

20 వేల కన్నా తగ్గిపోయి, రక్తస్రావ లక్షణాలు కూడా కనిపిస్తున్నట్టయితే ప్లేట్‌లెట్లు ఎక్కించాల్సి ఉంటుంది.

అదే 10వేల కన్నా తగ్గితే రక్తస్రావం అయినా, కాకపోయినా ప్లేట్‌లెట్లు ఎక్కించాలి.

ప్లేట్‌లెట్లను ఇతర రక్త పదార్థాల మాదిరిగా ఫ్రిజ్‌లో నిల్వ చేయలేం. అందువల్ల దూర ప్రాంతాల నుంచి సరఫరా చేసి, ఎక్కించే క్రమంలో కొన్నిసార్లు బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్లు తలెత్తొచ్చు. కొందరికివి రక్తంలోకి విస్తరించి, ప్రాణాపాయమూ సంభవించొచ్చు.

**చేయకూడనివి**

కార్టికోస్టిరాయిడ్లు ఇవ్వద్దు. ఇవి పేగుల్లో రక్తస్రావం, గ్లూకోజు బాగా పడిపోవటం, రోగనిరోధకశక్తి తగ్గటానికి దారితీస్తాయి.

డెంగీకి ప్రత్యేకించిన యాంటీ వైరల్ మందులేవీ లేవు. వైరల్ ఇన్‌ఫెక్షన్లకు యాంటీబయాటిక్స్ పనిచేయవు కాబట్టి వీటిని వాడొద్దు.

ముందుజాగ్రత్తగా ప్లేట్‌లెట్లు ఎక్కిస్తే ప్రయోజనం లేదు. ఇది తీవ్ర డెంగీ ముప్పునేమీ తగ్గించదు. పైగా ద్రవాల మోతాదు పెరిగి, ఎక్కువరోజులు ఆసుపత్రిలో ఉండాల్సి వస్తుంది.

అనవసరంగా సెలైన్ ఎక్కించొద్దు. నోటితో ద్రవాలు తీసుకోలేకపోతున్నా, రక్తంలో హిమోగ్లోబిన్ శాతం ఎక్కువున్నా, రక్తపోటు బాగా పడిపోయినా సెలైన్ అవసరం. అదీ తగినంత మోతాదులోనే ఎక్కించాలి. మూత్రం తగినంతగా వస్తున్నా, రక్తం పలుచగా అవుతున్నా సెలైన్ మోతాదు తగ్గించాలి.

**లక్షణాలు ఇవీ..**

డెంగీ వైరస్ సోకినా అందరికీ జ్వరం రాకపోవచ్చు. ఓ 10% మందిలోనే ఇన్‌ఫెక్షన్‌గా మారుతుంది. దీంతో ఉన్నట్టుండి తీవ్రమైన జ్వరం.. అతి తీవ్రంగా, తల పగిలిపోతోందేమో అన్నంత తలనొప్పి.. కళ్ల వెనక నొప్పి, వాంతి, వికారం, ఒళ్లు నొప్పులు, నడుం నొప్పి, కీళ్ల నొప్పులు, ఆకలి తగ్గటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. చాలామందికి ఒకట్రెండు లక్షణాలతోనే ఆగిపోవచ్చు కూడా. కొందరు తీవ్రదశకు చేరుకోవచ్చు.

**ఆ సమయాల్లో..**

దోమలు ఎప్పుడైనా కుట్టొచ్చు గానీ ఉదయం 6-8 గంటలు, సాయంత్రం 4-6 గంటల మధ్యలో ఎక్కువగా కుడతాయి. కాబట్టి ఈ సమయాల్లో మరింత జాగ్రత్తగా ఉండాలి.

**బొప్పాయితో జాగ్రత్త**

ప్లేట్‌లెట్లు పెరగటానికి కొందరు బొప్పాయి ఆకుల రసం తాగిస్తుంటారు. ఇది మంచి పద్ధతి కాదు. ఆకు రసంతో పేగుల్లో పుండ్లు పడే అవకాశముంది. అదేపనిగా బొప్పాయి, కివీ వంటి పండ్ల రసాలు తీసుకోవటమూ తగదు. ఇవి మితిమీరితే పొటాషియం మోతాదు ఎక్కువై, రక్తపోటు పడిపోవచ్చు.

**హెచ్చరిక సంకేతాలు ఇవీ..**

డెంగీలో జ్వరం తగ్గాకే అసలు ప్రమాదం మొదలవుతుంది. ప్లేట్‌లెట్లు తగ్గటం, రక్తనాళాల్లోంచి ద్రవం లీకవటం, రక్తంలో హిమోగ్లోబిన్ పెరగటం, రక్తం చిక్కబడటం అప్పుడే ఆరంభమవుతుంది. దీంతో మెదడు, కాలేయం, గుండె, ఊపిరితిత్తుల వంటి కీలక అవయవాలు దెబ్బతినటం, షాక్ సిండ్రోమ్ వంటి తీవ్ర అనర్థాలు తలెత్తుతాయి. కాబట్టి హమ్మయ్య జ్వరం తగ్గిందని అనుకోవద్దు. కొన్ని హెచ్చరికలను బట్టి తీవ్రదశ సంకేతాలను పసిగట్టొచ్చు. వీటిని గమనిస్తే ఏమాత్రం నిర్లక్ష్యం చేయొద్దు.

నివారణే ఉత్తమం

**దోమలు కుట్టకుండా ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.**

పూల కుండీలు, కూలర్లలలో నీరు ఎప్పటికప్పుడు మారుస్తుండాలి.

నీళ్ల ట్యాంకులు, బకెట్ల వంటి వాటిపై మూత పెట్టాలి.

పాత టైర్లు, కొబ్బరి చిప్పల వంటి వాటిని పారెయ్యాలి.

కిటికీలు, తలుపులకు జాలీలు బిగించుకోవాలి.

పడుకునేటప్పుడు దోమతెరలు వాడుకోవాలి.

బయటకు వెళ్లినప్పుడు పొడుగు చేతుల చొక్కాలు, ప్యాంట్లు ధరించాలి.

కాళ్లకు, చేతులకు దోమలను తరిమే క్రీములు రాసుకోవాలి.

# ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం వేసే ప్రసక్తే లేదు

- మొదటి పేజి తరువాయి

పరిమితం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని సీఎస్ విజయానంద్ ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి వివరించారు.

**నష్టాలు తగ్గించి.. కొనుగోళ్లు నియంత్రించాలి**

రాష్ట్రంలో 9 శాతంగా ఉన్న విద్యుత్ పంపిణీ నష్టాలను గణనీయంగా తగ్గించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఫీడర్లను సమర్థవంతంగా నిర్వహించడం, స్థానికంగా ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌ను అక్కడే వినియోగించడం ద్వారా ట్రాన్స్‌మిషన్ నష్టాలను అరికట్టవచ్చని అన్నారు. గతంలో తాను ప్రవేశపెట్టిన ఎనర్జీ ఆడిటింగ్ విధానాన్ని మళ్లీ అమలు చేసి విద్యుత్ చౌర్యాన్ని, నష్టాలను గుర్తించాలని సూచించారు. పెరిగే డిమాండ్‌ను ఎదుర్కొనేందుకు విద్యుత్ కొనుగోళ్లకు బదులుగా 'పవర్ స్వాపింగ్' వంటి విధానాలను అనుసరించాలని తెలిపారు.

**సౌర, పవన విద్యుత్‌కు పెద్దపీట**

థర్మల్ విద్యుత్ యూనిట్‌కు రూ.5 నుంచి రూ.6 ఖర్చవుతుండగా, పవన విద్యుత్‌కు కేవలం రూ.4.6 మాత్రమే వ్యయం అవుతోందని సీఎం గుర్తుచేశారు. రాష్ట్రంలో 65 గిగావాట్ల పవన విద్యుత్ ఉత్పత్తికి అవకాశాలున్నాయని, ఆ దిశగా ప్రాజెక్టులను ప్రోత్సహించాలని అన్నారు. రాయలసీమలో పంప్డ్ ఎనర్జీ ప్రాజెక్టులకు విస్తృత అవకాశాలున్నాయని పేర్కొన్నారు. పీఎం-సూర్యఘర్ సోలార్ రూఫ్ టాప్ పథకాన్ని వేగవంతం చేయాలని, ప్రతి నియోజకవర్గంలో కనీసం 10 వేల ఇళ్లకు ఈ పథకాన్ని వర్తింపజేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఈ పథకం పురోగతిపై ప్రతినెలా తానే స్వయంగా సమీక్షిస్తానని స్పష్టం చేశారు.

అలాగే, వ్యవసాయానికి ఎక్కడా స్మార్ట్ మీటర్లు బిగించవద్దని సీఎం చంద్రబాబు కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. పాతబడిన విద్యుత్ లైన్లను గుర్తించి, ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు 'ప్రెడిక్టివ్ మెయింటెనెన్స్' టెక్నాలజీని వాడాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

# సిట్ సీజ్ చేసిన రూ. 11 కోట్లపై నాకు అనుమానాలు ఉన్నాయి

ఏపీ లిక్కర్ స్కామ్ లో నిందితులకు ఏసీబీ కోర్టు మరోసారి రిమాండ్ పొడిగించింది. ఈ నెల 26వ తేదీ వరకు వీరి రిమాండ్ ను పొడిగిస్తున్నట్టు ఆదేశాలు జారీ చేసింది. రిమాండ్ పొడిగించిన నేపథ్యంలో నిందితులను కోర్టు నుంచి జైలుకు తరలించారు.

కోర్టుకు వచ్చిన సందర్భంగా ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. సిట్ అధికారులపై విమర్శలు గుప్పించారు. సిట్ సీజ్ చేసిన రూ. 11 కోట్లపై తనకు అనుమానాలు ఉన్నాయని ఆయన అన్నారు. కాల్ డేటా రికార్డులను స్వచ్ఛంద సంస్థతో విచారణ జరిపిస్తే అసలు విషయాలు వెలుగులోకి వస్తాయని కోర్టుకు తెలిపారు. సిట్ ఆధారాలను ధ్వంసం చేస్తోందని ఆరోపించారు. గతంలో లో కూడా సిట్ అధికారులపై రాజ్ కసిరెడ్డి ఆరోపణలు చేశారు. ఎక్కడో పట్టుకున్న డబ్బును తనకు లింక్ చేసి కట్టుకథలు అల్లుతున్నారని మండిపడ్డారు. తనకు బెయిల్ రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. రూ. 11 కోట్లతో తనకు సంబంధం లేదని గతంలో కూడా ఆయన వ్యాఖ్యానించడం గమనార్హం.

# పులివెందుల, ఒంటిమిట్ట ఉపఎన్నికల రగడ..

## వైసీపీపై ఎస్ఈసీకి ఫిర్యాదు చేసిన టీడీపీ నేతలు

పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉపఎన్నికల సందర్భంగా వైసీపీ నేతలు అప్రజాస్వామికంగా వ్యవహరించారని, విధి నిర్వహణలో ఉన్న పోలీసు అధికారులను బెదిరించి, దూషణలకు పాల్పడ్డారని తెలుగుదేశం పార్టీ తీవ్రంగా ఆరోపించింది. ఈ మేరకు బుధవారం నాడు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, మండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ నేతృత్వంలోని బృందం రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ)ను కలిసి ఫిర్యాదు చేసింది. వైసీపీ నేతలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు. అనంతరం టీడీపీ నేతలు మీడియాతో మాట్లాడి, వైసీపీ తీరును తీవ్రంగా ఎండగట్టారు.

**ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగితే జగన్ ఓర్వలేరా?: వర్ల రామయ్య**

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య మాట్లాడుతూ, "ఐదేళ్ల రాక్షస పాలనను జగన్ రెడ్డి అప్పుడే మరిచిపోయి, 15 నెలల చంద్రబాబు పాలనపై విమర్శలు చేయడం దొంగే దొంగ అన్నట్లుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో కనీసం నామినేషన్లు కూడా వేయనీయకుండా ప్రత్యర్థులపై దాడులు చేయించి, వారి ఇళ్లలో సారా సీసాలు పెట్టి అరెస్టులు చేయించిన చరిత్ర జగన్‌ది. ఇప్పుడు పులివెందుల, ఒంటిమిట్టలో ప్రజలు మూడు దశాబ్దాల తర్వాత స్వేచ్ఛగా ఓటు వేస్తుంటే తట్టుకోలేకపోతున్నారు. విధుల్లో ఉన్న పోలీస్ అధికారిని వ్యక్తిగతంగా దూషించడం, ఆయన శరీరాకృతిని కించపరచడం చట్టరీత్యా నేరం. పోలీసుల నుంచి తప్పించుకు తిరుగుతున్న ఎంపీ అవినాశ్ రెడ్డి, అధికారులను బెదిరిస్తున్న వైసీపీ నేతలపై ఈసీ వెంటనే చర్యలు తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు.

**అసెంబ్లీకి రావడానికే జగన్‌కు భయం: దేవినేని ఉమ**

మాజీ మంత్రి దేవినేని ఉమ మాట్లాడుతూ, "గత 30 ఏళ్లుగా పులివెందుల, కడప జిల్లాల్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు. ఇప్పుడు అదే జగన్ రెడ్డి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం హాస్యాస్పదం. గతంలో వేల స్థానాలను ఏకగ్రీవం చేసుకున్న చరిత్ర వారిది. ఇప్పుడు ప్రశాంతంగా ఎన్నికలు జరిగితే రీపోలింగ్ కోసం ఒత్తిడి చేస్తున్నారు. అసెంబ్లీకి రావాలంటేనే జగన్‌కు ధైర్యం చాలడం లేదు. డీఐజీ కోయ ప్రవీణ్ ఆధ్వర్యంలో ఎన్నికలు అద్భుతంగా జరిగితే, ఆయనపై విమర్శలు చేస్తున్నారు. రేపటి ఫలితాల్లో ఓటమి ఖాయమని తెలిసే జగన్ ఈ ప్రెస్ మీట్లు పెడుతున్నారు. వివేకా హత్య కేసులో సొంత చెల్లి అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేని వ్యక్తి జగన్. పోలీసులపై బాడీ షేమింగ్ వ్యాఖ్యలు చేసిన వారిపై ఈసీ కఠిన చర్యలు తీసుకోవాలి" అని అన్నారు.

**అసలైన రాక్షస పాలన జగన్‌దే: పంచుమర్తి అనురాధ**

మండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ మాట్లాడుతూ, "31 క్రిమినల్ కేసుల్లో ఉన్న జగన్ రెడ్డి, 14 ఏళ్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబుపై విమర్శలు చేయడం విడ్డూరం. 'తల్లికి వందనం' పథకాన్ని విమర్శిస్తున్న మీరు, అమ్మఒడి పేరుతో ప్రజలను మోసం చేశారు. మూడు రాజధానుల పేరుతో అమరావతిని నాశనం చేసి, ఇప్పుడు అభివృద్ధి చేస్తుంటే అడ్డుకుంటున్నారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి నీళ్లు అందించే ప్రయత్నాన్ని రాక్షస పాలన అనడం మీ అవివేకానికి నిదర్శనం" అని విమర్శించారు.

**వైసీపీ గుర్తింపు రద్దు చేయాలి: ఎమ్మెల్యే బోడె ప్రసాద్**

ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ, "జగన్ వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లున్నాయి. అధికారం కోల్పోయినా ఆయనలో అహంకారం తగ్గలేదు. అధికారులను, ముఖ్యమంత్రిని దూషిస్తున్న ఆయన మానసిక స్థితి బాగోలేదు. ఇలాంటి హింసాత్మక వ్యాఖ్యలు చేస్తున్న వైసీపీ గుర్తింపును శాశ్వతంగా రద్దు చేయాలి" అని డిమాండ్ చేశారు. ఈసీని కలిసిన వారిలో ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ కుప్పం రాజశేఖర్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కోడూరు అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# జగన్... నేను దేని గురించి మాట్లాడుతున్నానో మీకు బాగా తెలుసు!

ఎన్నిక ల్లో ఓటమి కి సాకులు వెతకడం మానుకోవాలని, 'నోట్ల చోరీ' వల్లే ప్రజలు వైసీపీని తిరస్కరించారని ఆయన ఘాటుగా విమర్శించారు. ఈ మేరకు బుధవారం ఆయన సోషల్ మీడియా వేదికగా జగన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ ప్రజలతోనే నిజమైన 'హాట్‌లైన్' ఉందని లోకేశ్ అన్నారు. పదేపదే తప్పుడు ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు ఫలించవని స్పష్టం చేశారు. "ఓట్ల చోరీ జరిగిందని చెప్పడం కాదు.. వరుస కుంభకోణాల్లో మీరు చేసిన నోట్ల చోరీ వల్లే ఓడిపోయారు. నేను దేని గురించి మాట్లాడుతున్నానో మీకు బాగా తెలుసు" అంటూ లోకేశ్ పరోక్షంగా మద్యం స్కామ్‌లను ఉద్దేశిస్తూ ఎద్దేవా చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలోని డబుల్ ఇంజిన్ సర్కార్ రాష్ట్ర ప్రగతికి కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు. "మా డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి కట్టుబడి ఉంది. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు గారి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌ను మళ్లీ దేశంలోనే నంబర్ 1 స్థానంలో నిలబెడతాం" అని లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించకుండా, నిరాధార ఆరోపణలు చేయడం తగదని ఆయన జగన్‌కు హితవు పలికారు.

# ఓటమి భయంతోనే టీడీపీ అరాచకాలు..

- మొదటి పేజి తరువాయి

వీడియో ఫుటేజ్‌లను ఆయన మీడియా ముందు ప్రదర్శించారు. పులివెందుల డీఎస్పీ ఒకరు 'కాల్చి పారేస్తా నా కొ..!' అంటూ తమ పార్టీ కార్యకర్తలను బెదిరించారని జగన్ ఆరోపించారు. ఇందుకు సంబంధించిన వీడియోను ఆయన ప్లే చేసి చూపించారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు జరుగుతుంటే, ఓ అధికారి ఇలాంటి భాష వాడటం దారుణమని ఆయన మండిపడ్డారు. దీనికితోడు, పులివెందుల పట్టణంలోని వైసీపీ ఎమ్మెల్యే కార్యాలయానికి డీఐజీ కోయ ప్రవీణ్ వెళ్లి హడావిడి సృష్టించారని ఆరోపించారు. మరో ఘటనలో, రాయచోటి ఎమ్మెల్యే, మంత్రి రామప్రసాద్ రెడ్డికి సంబంధం లేకపోయినా ఒంటిమిట్ట మండలంలోని చిన్నకొత్తపల్లె గ్రామానికి వెళ్లి పోలింగ్ బూత్‌లో రౌడీయిజం చేశారని జగన్ విమర్శించారు. మంత్రి సమక్షంలోనే తమ ఏజెంట్లను బూత్‌ల నుంచి బయటకు లాగి, వారిపై దాడి చేశారని ఆరోపించారు. తుమ్మలపల్లి గ్రామంలో జమ్మలమడుగు నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేత భూపేశ్ రెడ్డి పీఏ సుదర్శన్ రెడ్డి దొంగ ఓట్లు వేయించడానికి ప్రయత్నించారని, ఓటర్ల స్లిప్పులు పంచుతూ కెమెరాకు చిక్కారని తెలిపారు. ప్రజల మద్దతుపై నమ్మకం లేకపోవడం వల్లే చంద్రబాబు ఇలాంటి దౌర్జన్యపూరిత చర్యలకు పాల్పడుతున్నారని జగన్ దుయ్యబట్టారు. ప్రజలు తమకు ఓటు వేయరనే భయంతోనే టీడీపీ నేతలు ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేస్తున్నారని అన్నారు. 2017లో నంద్యాల ఉపఎన్నికలో కూడా టీడీపీ ఇదే తరహాలో అధికార దుర్వినియోగానికి పాల్పడిందని ఆయన గుర్తుచేశారు. నిజంగా ప్రజలకు మంచి చేసి ఉంటే, ఇలాంటి అక్రమాలకు దిగాల్సిన అవసరం ఏముందని ఆయన చంద్రబాబును ప్రశ్నించారు.

# రీపోలింగ్ ను బహిష్కరిస్తున్నాం

- మొదటి పేజి తరువాయి

మేరకు ఈరోజు ఉప ఎన్నిక జరుగుతోంది. ఈ సందర్భంగా వైసీపీ ఎంపీ అవినాశ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రీపోలింగ్ ను తాము బహిష్కరిస్తున్నామని అవినాశ్ తెలిపారు. అన్ని పోలింగ్ బూత్ లలో అవకతవకలు జరిగిన విషయాన్ని నిన్న రాష్ట్ర ప్రజలందరూ చూశారని... కానీ రెండు బూత్ లలో మాత్రమే రీపోలింగ్ నిర్వహిస్తున్నారని విమర్శించారు. కంటితుడుపు చర్యగా రీపోలింగ్ నిర్వహిస్తున్నారని అన్నారు. పులివెందులలో సరికొత్త సంస్కృతిని ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకొచ్చారని మండిపడ్డారు. కేంద్ర బలగాలతో రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. రీపోలింగ్ అనేది ఒక డ్రామా అని విమర్శించారు. మొత్తం 15 బూత్ లలో దొంగ ఓట్లు వేశారని తెలిపారు. ఇతర నియోజకవర్గాల నుంచి వచ్చిన టీడీపీ కార్యకర్తలు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల నుంచి స్లిప్ లు తీసుకుని వెళ్లి వాళ్లే ఓటు వేశారని ఆరోపించారు.

# లోకేశ్ నియోజకవర్గంలో సందడి చేసిన నారా బ్రాహ్మణి...

- మొదటి పేజి తరువాయి

అక్కడ శిక్షణ పొందుతున్న మహిళలతో బ్రాహ్మణి ముచ్చటించి, వారి అనుభవాలను, శిక్షణ ద్వారా పొం దుతున్న ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత, నియోజకవర్గంలో చిన్నారుల కోసం నూతనంగా నిర్మించిన పార్కును బ్రాహ్మణి సందర్శించారు. అక్కడి ఆహ్లాదకరమైన వాతావరణంలో, పిల్లలతో కలిసి సరదాగా గడిపారు. ఈ సందర్భంగా పార్కులోని ఉయ్యాలపై ఆమె సరదాగా ఊగడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం, శ్రీ పానకాల లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం మంత్రి నారా లోకేశ్ ఏర్పాటు చేసిన ఉచిత బస్సు సేవలను బ్రాహ్మణి పరిశీలించారు. బస్సులో ప్రయాణిస్తున్న భక్తులతో నేరుగా మాట్లాడి, వారికి అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. బస్సు సర్వీసు వల్ల తమకు ప్రయాణం సులభతరం అయిందని, ఎలాంటి ఇబ్బందులు లేవని భక్తులు ఆమెకు వివరించారు. ఈ పర్యటన ద్వారా నియోజకవర్గంలో అమలవుతున్న కార్యక్రమాల పురోగతిని ఆమె సమీక్షించారు.

# ఏపీ ఎన్నికలపై జగన్ వ్యాఖ్యలు.. తీవ్రంగా స్పందించిన తెలంగాణ కాంగ్రెస్ ఎంపీ

- మొదటి పేజి తరువాయి

ఓడిపోయినా జగన్ ఆలోచనా విధానం మారలేదని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏమైనా తప్పులు జరిగినట్లు భావిస్తే ఎన్నికల కమిషన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీని విమర్శించవచ్చని, కానీ రాహుల్ గాంధీని తప్పుపట్టడమేమిటని ఆయన ప్రశ్నించారు. విజయవాడలో ధర్నాలో రాహుల్ గాంధీతో కలిసి జగన్ పాల్గొనాలని సూచించారుబుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో జగన్... రాహుల్ గాంధీపై విమర్శలు గుప్పించారు. చంద్రబాబు, రేవంత్ రెడ్డికి సాన్నిహిత్యం ఉండటం వల్ల ఆయన ఆంధ్రప్రదేశ్ ఎన్నికల గురించి మాట్లాడలేదని జగన్ ఆరోపించారు.

# కొత్త జిల్లాల ఏర్పాటుపై వినతులు స్వీకరిస్తాం

గత వైసీపీ ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటు ప్రక్రియను అస్తవ్యస్తంగా చేపట్టిందని మంత్రి అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. తొందరపాటు చర్యలు, ఒత్తిళ్లతో జిల్లాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుకూలంగా జిల్లాల ఏర్పాటు జరగలేదని చెప్పారు. కొత్త జిల్లాల ఏర్పాటులో సమస్యలను పరిష్కరించేందుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మంత్రులు రెండు గ్రూపులుగా విడిపోయి ఈ నెల 29, 30 తేదీల్లో జిల్లాల్లో పర్యటిస్తామని చెప్పారు. 13 ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో సమావేశాలు ఏర్పాటు చేస్తామని... ప్రజాప్రతినిధులు, ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని తెలిపారు. ఈరోజు నుంచి ప్రజలు తమ వినతులను జిల్లా కలెక్టర్లకు ఇవ్వొచ్చని చెప్పారు.

అన్ని అంశాలపై చర్చించి ముఖ్యమంత్రి చంద్రబాబుకు నివేదిక ఇస్తామని తెలిపారు. మంత్రివర్గంలో చర్చించిన తర్వాత ముఖ్యమంత్రి

తుది నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. డిసెంబర్ చివరి నాటికి జిల్లాల సరిహద్దుల మార్పుల ప్రక్రియ పూర్తిచేస్తామని తెలిపారు. కేవలం జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల సరిహద్దులను మాత్రమే మారుస్తామని... నియోజకవర్గాల్లో మార్పులు, చేర్పులు మాత్రం చేయడం లేదని చెప్పారు. జిల్లా కేంద్రాలు చాలా దూరంగా ఉండటం వల్ల ప్రజలు కష్టాలు పడుతున్నారని తెలిపారు.

# 79వ స్వాతంత్ర్య దినోత్సవం: నేడు జాతినుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం

- మొదటి పేజి తరువాయి

ఈ ప్రసంగాన్ని ఆకాశవాణి, దూరదర్శన్ జాతీయ నెట్‌వర్క్‌లలో ప్రసారం చేయనున్నట్టు ప్రభుత్వ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. మొదట హిందీలో, ఆ తర్వాత ఆంగ్లంలో ఈ ప్రసంగం ఉంటుంది. అనంతరం దూరదర్శన్ ప్రాంతీయ ఛానెళ్లలో స్థానిక భాషల్లో ప్రసారం చేస్తారు. ఆకాశవాణి తమ ప్రాంతీయ నెట్‌వర్క్‌లపై రాత్రి 9:30 గంటలకు అనువాద ప్రసంగాలను ప్రసారం చేస్తుంది. శుక్రవారం (ఆగస్టు 15) ఉదయం, ప్రధాని నరేంద్ర మోదీ చారిత్రాత్మక ఎర్రకోట బురుజుల నుంచి సంప్రదాయబద్ధంగా జాతినుద్దేశించి ప్రసంగిస్తారు. 1947లో బ్రిటిష్ పాలన నుంచి స్వాతంత్ర్యం పొందిన చారిత్రక ఘట్టానికి గుర్తుగా ఏటా ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా జెండా వందనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇండియా గేట్, మండి హౌస్, మథురా రోడ్ వంటి కీలక ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. పార్కింగ్ లేబుల్స్ లేని వాహనాలు ఈ మార్గాలకు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. మరోవైపు, వేడుకల్లో పాల్గొనే ప్రజలు, అతిథుల సౌలభ్యం కోసం ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్సీ) ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఆగస్టు 15న అన్ని లైన్లలో ఉదయం 4 గంటల నుంచే మెట్రో సేవలు ప్రారంభమవుతాయని డీఎంఆర్సీ వెల్లడించింది. ఉదయం 4 గంటల నుంచి 6 గంటల వరకు ప్రతి 30 నిమిషాలకు ఒక రైలు నడుస్తుందని, ఆ తర్వాత యథావిధిగా సాధారణ షెడ్యూల్ కొనసాగుతుందని తెలిపింది.

వేడుకల్లో భాగంగా ప్రజల్లో దేశభక్తిని నింపేందుకు ఢిల్లీలోని పలు ప్రముఖ ప్రదేశాల్లో సాయుధ దళాలు, కేంద్ర సాయుధ పోలీస్ దళాలు (సీఏపీఎఫ్), రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్), నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) బ్యాండ్లతో ప్రత్యక్ష ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

# భారత్-రష్యా మైత్రి.. మాస్కోలో జైశంకర్, లావ్రోవ్ కీలక భేటీ

భారత్, రష్యా మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలపడుతోంది. ఇరు దేశాల మధ్య ఉన్నత స్థాయి సమావేశాలు, పర్యటనలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ క్రమంలోనే భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ మధ్య మరో కీలక భేటీ జరగనుంది. ఈ నెల ఆగస్టు 21న మాస్కోలో వీరిద్దరూ సమావేశం కానున్నారు. ఈ విషయాన్ని రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ బుధవారం అధికారికంగా ధృవీకరించింది. ద్వైపాక్షిక ఎజెండాలోని ముఖ్యమైన అంశాలతో పాటు, అంతర్జాతీయ వేదికలపై సహకారం గురించి ఇరువురు నేతలు చర్చిస్తారని ఒక ప్రకటనలో తెలిపింది. ఇటీవల భారత జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్ మాస్కోలో పర్యటించిన కొద్ది రోజులకే ఈ సమావేశం జరగనుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. తన పర్యటనలో దోవల్... రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, రష్యా భద్రతా మండలి కార్యదర్శి సెర్గీ షోయిగు, ఇతర ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. గత కొంతకాలంగా జైశంకర్, లావ్రోవ్ పలు వేదికలపై సమావేశమవుతూనే ఉన్నారు. గత నెలలో జరిగిన బ్రిక్స్ సదస్సు సందర్భంగా, జూలై 15న జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) విదేశాంగ మంత్రుల సమావేశం సందర్భంగా కూడా వీరిద్దరూ చర్చలు జరిపారు. పశ్చిమాసియా, బ్రిక్స్, ఎస్‌సీఓ వంటి అంశాలతో పాటు ద్వైపాక్షిక సహకారంపై మంతనాలు జరిపారు.

ఈ ఏడాది మార్చి 7న భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ సైతం మాస్కోలో పర్యటించి రష్యా డిప్యూటీ విదేశాంగ మంత్రితో సంప్రదింపులు జరిపారు. ఇరు దేశాల మధ్య ఉన్నత స్థాయిలో తీసుకున్న నిర్ణయాల అమలు పురోగతిని సమీక్షించారు.

ఇదిలా ఉండగా, ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ త్వరలో భారత్‌లో పర్యటించే అవకాశం ఉంది. ఇరు దేశాల నేతల మధ్య వార్షిక సమావేశాల సంప్రదాయాన్ని కొనసాగించేందుకు ఈ పర్యటనకు సన్నాహాలు జరుగుతున్నాయి.



## శ్రీవారికి బంగారు లక్ష్మీ పతకం విరాళం

**తిరుమల పెన్ పవర్ ఆగస్టు 13 :** బెంగుళూరుకు చెందిన శ్రీ కె.యం. శ్రీనివాసమూర్తి అనే భక్తుడు బుధవారం ఉదయం భోగ శ్రీనివాస మూర్తికి అలంకరించేందుకు రూ.25 లక్షలు విలువైన వజ్రం, వైజయంతి పొదిగిన 148 గ్రాముల బంగారు లక్ష్మీ పతకాన్ని విరాళంగా అందించారు. ఈ మేరకు శ్రీవారి ఆలయంలోని రంగనాయకులు మండపంలో టీటీడీ అదనపు ఈవో శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరికి ఆభరణాన్ని అందజేశారు.


# పెన్ పవర్

వై.ఎస్.ఆర్. కడప


అన్నమయ్య జిల్లా


# కౌంటింగ్‌కు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు...!



### – జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

**కడప, పెన్ పవర్ ఆగస్టు 13 :** పటిష్టమైన భద్రతా బలగాల మధ్య.. కౌంటింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లను సంసిద్ధం చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. జెడ్పిటిసీ ఉప ఎన్నికలకు సంబంధించి.. బుధవారం సాయంత్రం కడప రిమ్స్ సమీపంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ నేషనల్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. జేసీ అదితి సింగ్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. స్ట్రాంగ్ రూముల్లో.. పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో పాటు, పోలింగ్ కేంద్రాల్లో పోలైన ఓట్లతో నిక్షిప్తమైన బ్యాలెట్ బాక్సులను అత్యంత సురక్షితంగా భద్రపరచడం జరిగిందన్నారు. కౌంటింగ్ హాలులో ఓట్ల లెక్కింపు సజావుగా, సౌకర్యవంతంగా జరిగేలా సెటప్ చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా వివిధ రాజకీయ పార్టీల ఏజెంట్లు కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు వీలుగా ఏర్పాట్లు చేశామన్నారు. ఓట్ల లెక్కింపు కోసం ఓట్ల లెక్కింపు కోసం ఇప్పటికే సిబ్బందిని ఏర్పాటు చేసి.. మైక్రోఅబ్జర్వర్లు, కౌంటింగ్ ఏజెంట్లు, సూపర్వైజర్లను నియమించి కౌంటింగ్ పై వారికి శిక్షణ కూడా ఇవ్వడం జరిగిందన్నారు. రౌండ్ల వారీగా కౌంటింగ్ సమాచారం కోసం మీడియా సెంటర్ నుకుడా ఏర్పాటు చేశామన్నారు. ఏ చిన్నపాటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా.. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జెడ్పి సీఈవో ఓబులమ్మ, ఏఆర్వోలు జాన్ ఇర్విన్, రంగస్వామి, డ్వామా పీడి ఆదిశేషారెడ్డి, డిఎస్పీ వెంకటేశ్వర్లు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.







### వర్షాలు వస్తున్న నేపథ్యంలో

# అధికార యంత్రాంగం అప్రమత్తం కావాలి

**– రిజర్వాయర్లు,చెరువులు, లోతట్టు ప్రాంతాలు, పాత బ్రిడ్జి లు పరిశీలించండి**

**– వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలి**

**– జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**



**కర్నూలు, పెన్ పవర్ ఆగస్టు 13 :** జిల్లాలో అధికంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తం కావాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా ఆదేశించారు. జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం సబ్ కలెక్టర్ ఆర్డీవోలు తహసీల్దార్లు, ఎంపిడిఓ లు, ఇరిగేషన్ అధికారులతో జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గత రెండు మూడు రోజులుగా అధిక వర్షపాతం నమోదయిందన్నారు.. జూన్ జూలైలో సాధారణ వర్షపాతం నమోదు కాగా, ఆగస్టులో ఇప్పటివరకు 146.5 మి.మీ తో 27.8% అధిక వర్ష పాతం నమోదయిందన్నారు. కర్నూలు అర్బన్, కర్నూలు రూరల్, కల్లూరు, చిప్పగిరి, హాలహర్వి ,ఆలూరు, మద్దికెర, నందవరం మండలాలలో అధిక వర్షపాతం నమోదయిందన్నారు. వచ్చే రెండు మూడు రోజుల్లో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రిజర్వాయర్లు,చెరువులు, లోతట్టు ప్రాంతాలు, పాత బ్రిడ్జి లు పరిశీలించాలని కలెక్టర్ సబ్ కలెక్టర్, తహసీల్దార్లు, ఇరిగేషన్ అధికారులు, ఆర్ అండ్ బి అధికారులు, ఎంపిడిఓ లను ఆదేశించారు.. అవసరమైన చోట ప్రమాదాలు జరుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సుంకేసుల, గాజుల దిన్నె, పందికోన రిజర్వాయర్లను పరిశీలించాలని సబ్ కలెక్టర్, ఆర్డీవోలను ఆదేశించారు. అలాగే నదీ తీర ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా తహసీల్దార్ లు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు..లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉన్న చోట మోటార్లతో తొలగించాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణకు స్ప్రేయింగ్, ఇతర పారిశుధ్య చర్యలు తీసు కోవాలని కలెక్టర్ డిపివో ను ఆదేశించారు.

పంచాయతీ సెక్రటరీలు, ఈవో పి ఆర్ డీ లతో సమావేశం నిర్వహిం చుకుని గ్రామాల్లో పారిశుధ్య చర్యలు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎంపిడిఓ లను ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో నీరు కలుషితం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే నీటిని ట్రాన్స్పోర్ట్ చేయాలని కలెక్టర్ గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులను ఆదేశించారు. వర్షాలు ఎక్కువగా వచ్చి పిల్లలు పాఠశాలలకు వెళ్లలేని పరిస్థితుల్లో సెలవు ప్రకటించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీఈఓ ను ఆదేశించారు. ఎక్కడైనా పాత ఇళ్లు ఉంటే, అందులో నివాసం ఉన్న వారిని అప్రమత్తంచేసి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

**పల్లెకు పోదాం కార్యక్రమం సందర్భంగా అధికారులు సిద్ధంగా ఉండాలి :** వచ్చే వారం పల్లెకు పోదాం కార్యక్రమం సందర్భంగా స్పెషల్ ఆఫీసర్లు గ్రామాలను సందర్శించి, గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, అంగన్వాడీలు, స్కూల్స్, తదితర అన్ని అంశాలపై తనిఖీ చేస్తారని, మండల, గ్రామ స్థాయి అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. స్పెషల్ ఆఫీసర్ వెంట తహసీల్దార్లు, ఎంపిడిఓ లు తమ టీములతో వెళ్ళాలని కలెక్టర్ ఆదేశించారు..తనిఖీకి సంబంధించి ప్రొఫార్మా పంపుతామని, ఆ మేరకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. టెలి కాన్ఫరెన్స్ లో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఆర్డీవోలు సందీప్ కుమార్, భరత్ నాయక్, డీపీఎం అనుపమ, జల వనరుల శాఖ ఎస్ ఈ బాల చంద్రా రెడ్డి, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎస్ ఈ నాగేశ్వరరావు, డిపివో భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


## యువతకు మరింతగా చేరువయ్యేలా అన్నమయ్య కీర్తనలు

### – టిటిడి ఈవో జె.శ్యామలరావు



**తిరుమల పెన్ పవర్ ఆగస్టు 13 :** పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్య కీర్తనలను యువతకు మరింతగా చేరువయ్యేలా చర్యలు తీసుకోవాలని టిటిడి ఈవో జె. శ్యామలరావు అధికారులను ఆదేశించారు. టిటిడి పరిపాలనా భవనంలోని కార్య నిర్వాణాధికారి ఛాంబర్‌లో టిటిడి జేఈవో వి.వీం బ్రహ్మంతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, అన్నమయ్య కీర్తనలపై ప్రాంతీయ స్థాయిలో, జిల్లా స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహించి యువతను భాగస్వామ్యం చేయాలని సూచించారు. తద్వారా అన్నమయ్య కీర్తనలను మరింతగా జన బాహుళ్యంలోకి తీసుకెళ్లవచ్చని తెలిపారు. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని కీర్తిస్తూ వాగ్గేయ కారుడు అన్నమయ్య 14, 973 కీర్తనలను ఆలపించారని, ఇందులో 4,850 కీర్తనలను ఎస్వీ రికార్డింగ్ ప్రాజెక్ట్ రికార్డు చేసి 4,540 కీర్తనలను మాత్రమే అప్ లోడ్ చేశారని, మిగిలిన కీర్తనలను కూడా సకాలంలో రికార్డ్ చేసి భక్త ప్రపంచానికి అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్నమయ్య కీర్తనలను మరింతగా యువతకు అందించి, ప్రాచుర్యంలోకి తీసుకెళ్లేందుకు ప్రత్యేకంగా యూట్యూబ్ ఛానల్‌కు తీసుకువచ్చే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. టిటిడి నిబంధనల మేరకు నవతరం గాయకులతో అన్నమయ్య కీర్తనలను రికార్డ్ చేసే అంశాన్ని పరిశీలించాలన్నారు. కాలానుగుణంగా సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా డిజిటల్ వ్యవస్థ ద్వారా అన్నమయ్య కీర్తనలను నవతరానికి అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హిందూ ధార్మిక్ ప్రాజెక్ట్ ప్రత్యేక అధికారి కె.రాజగోపాల్, అన్నమాచార్య ప్రాజెక్ట్ సంచాలకులు డా. సి.లత, ఎస్వీ రికార్డింగ్ ప్రాజెక్ట్ ప్రత్యేక అధికారి ఆకెళ్ల విభీషణశర్మ పాల్గొన్నారు.

# టీటీడీకి రూ.కోటి విరాళం



**తిరుపతి, పెన్ పవర్ ఆగస్టు 13 :** బెంగుళూరుకు చెందిన శ్రీ కల్యాణ్ రామన్ కృష్ణమూర్తి అనే భక్తుడు బుధవారం టీటీడీ శ్రీవేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టు రూ.కోటి విరాళంగా అందించారు.

## టీటీడీ పరిపాలనా భవనంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు





**తిరుమల పెన్ పవర్ ఆగస్టు 13 :** ఆగష్టు 15న నిర్వహించే 79వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు టిటిడి ఏర్పాట్లు చేస్తోంది. తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనం ప్రాంగణంలోని పరేడ్ మైదానంలో వేదికను అందంగా ముస్తాబు చేస్తున్నారు. శుక్రవారం ఉదయం 8.30 గంటలకు ఈ వేడుకలు ప్రారంభమవుతాయి. జాతీయ జెండా వందనం అనంతరం విధుల్లో ఉత్తమ ప్రతిభను కనపరిచిన వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులకు ఐదు గ్రాముల వెండి డాలర్, ప్రశంసాపత్రాలను అందజేస్తారు. టీటీడీ విద్యాసంస్థల విద్యార్థులు, ఉద్యోగుల పిల్లలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శిస్తారు.

# పంద్రాగస్టు వేడుకలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి

### ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ శివ్ నారాయన్ శర్మ







**అనంతపురం, పెన్ పవర్ ఆగస్టు 13 :** జిల్లా కేంద్రంలోని పోలీస్ పెరేడ్ మైదానంలో ఈనెల 15న జరిగే 79 వ భారతస్వాతంత్ర దినోత్సవ వేడుకలను ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ శివ్ నారాయన్ శర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఏఆర్ఏ ఎస్పి ఇలియాజ్ బాషా,అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ సహార్ తో కలిసి అనంతపురం పోలీస్ పెరేడ్ మైదానం లో జరిగే కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి పనులను పరిశీలించారు. తొలుత పోలీసు కవాతు తదితర రిహార్సల్స్ లో పాల్గొన్నారు. అలాగే మైదానంలో ఇప్పటివరకు జరుగుతున్న పనుల గురించి అధికారుల ద్వారా ఆరా తీశారు.

ఈ సందర్భంగా ఇంచార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం మేరకు శుక్రవారం ఉదయం 9 – 02 గంటలకు మన జిల్లా వాసి అయిన రాష్ట్ర ఆర్థిక ,ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రివర్యులు గౌరవ మాన్యశ్రీ పయ్యావుల కేశవ్ పాల్గొని జాతీయ పతాకావిష్కరణ గావిస్తారని తెలిపారు. ప్రజలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఇన్చార్జ్ కలెక్టర్ కోరారు. ఈ నేపథ్యంలో వేడుకలకు సంబంధించి పకడ్బందీగా అవసరమైన అన్ని ఏర్పాట్లను పక్కాగా రేపటిలోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా దేశభక్తి ఉట్టిపడే విధంగా కార్యక్రమాల నిర్వహణ చేపట్టాలని ఆదేశించారు.

అలాగే పోలీస్ పెరేడ్ గ్రౌండ్ నందువేదిక అలంకరణ, పోలీస్, ఎన్ .సి.సి. హెూంగార్డుల పెరేడ్ నిర్వహణ, జాతీయ పతాకావిష్కరణ ఏర్పాటు చర్యలు, ప్రోటోకాల్, పోలీసు బందోబస్తు అంశాలపై జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ఆహ్వాన పత్రికల పంపిణీ, నిరంతర విద్యుత్ సరఫరా, సీటింగ్ ఏర్పాట్లు, త్రాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య పనులు, ట్రాఫిక్ మళ్లింపులు, పార్కింగ్ స్థలం ఏర్పాటు, బారి కేడింగ్, మొబైల్ టాయిలెట్ల ఏర్పాట్లు, వైద్య ప్రథమ చికిత్స శిబిరం ఏర్పాటు, పి.టి.సి. బ్యాండ్ ఏర్పాటు ,విశిష్ట సేవలు అందించిన వారికి ప్రశంస పత్రాల ప్రదానం తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులు ప్రత్యేక దృష్టిని సారించి ఎలాంటి లోటుపాట్లు లేకుండా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ప్రజలకు తెలియజేసే విధంగా వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా శాఖకటాల ప్రదర్శన మరియు స్టాల్స్ ను ఏర్పాటు చేయాలని, వివిధ పాఠశాలల విద్యార్థుల ద్వారా దేశభక్తిని పెంపొందించే విధంగా జాతీయసమైక్యత పై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని ఇంచార్జ్ కలెక్టర్ ఆయా శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమం ప్రారంభం నుండి జాతీయ గేయం ముగింపు వరకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రణాళిక బద్ధంగా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుని రెవెన్యూ పోలీసు తదితర శాఖల అధికారులు సమన్వయం చేసుకొని ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, ఆర్డీఓ కేశవ నాయుడు, డిప్యూటీ కలెక్టర్లు మల్లికార్జునుడు, రామ్మోహన్, మల్లికార్జున, డి ఐ పి ఆర్‌ఓ బాల కొండయ్య, హౌసింగ్ పిడిశైలజ, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, విద్యుత్ శాఖ ఈ ఈ రమేష్ డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, మెప్మా పీడీ విశ్వ జ్యోతి, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఆర్.అండ్.బి ఎస్ఈ రాజగోపాల్, ఏపీఎంఐపీ పిడీ రఘునాథ్ రెడ్డి, తహసీల్దార్లు హరికుమార్, మోహన్ రావు, మహబూబ్ భాష, ఆర్ట్స్ కళాశాల ఎన్సిసి, డా. అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థిని విద్యార్థులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కౌంటింగ్ ప్రక్రియ పులివెందుల ఒంటిమిట్ట



**కడప పెన్ పవర్ ఆగస్టు 13 :** కౌంటింగ్ కేంద్రం: కడప రిమ్స్ సమీపంలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాల.

**టేబుల్స్,రౌండ్ల వివరాలు :**

పులివెందుల ఉప ఎన్నిక కౌంటింగ్ – 10 టేబుళ్లు,1 రౌండ్

ఒంటిమిట్ట ఉపఎన్నిక కౌటింగ్ – 10 టేబుళ్లు, దాదాపు 3 రౌండ్లు

ఒక్కొక టేబుల్‌కు – ఒక సూపర్వైజర్ , ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్లు చొప్పున ఉన్నారు. కౌటింగ్ స్టాఫ్: సూపర్వైజర్లు 30 మంది, కౌంటింగ్ అసిస్టెంట్లు 60 మంది, అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారులు ముగ్గురు, తదితర సిబ్బంది కలిపి దాదాపు 100 మంది.

## జడ్పీటీసీ ఉప ఎన్నిక రీ పోలింగ్ ప్రత్యేకం




**కడప పెన్ పవర్ ఆగస్టు 13 :** పులివెందుల జడ్పిటిసి ఉప ఎన్నిక 'రీ' పోలింగ్ కు సంబంధించి బుధవారం ఉదయాన్నే ప్రారంభమైన 'రీ' పోలింగ్. ఇ–కొత్తపల్లి మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన 'రీ' పోలింగ్ కేంద్రం బూత్ నెంబరు – 14 లలో ఓటు హక్కు వినియోగించు కుంటున్న ఓటర్లు. పోలింగ్ కేంద్రం నందు భద్రత ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ ఈ జీ అశోక్ కుమార్.

## తిరుపతిలో విస్తృతంగా వాహన తనిఖీలు




**కడప పెన్ పవర్ ఆగస్టు 13 :** జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీ మోహన్ ఆదేశాల మేరకు తిరుపతిలో విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించబడ్డాయి. హైదరాబాద్ నుంచి తిరుపతి, అలాగే బెంగళూరు నుంచి తిరుపతికి వస్తున్న రెండు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు ఆల్ ఇండియా పర్మిట్ టాక్స్ చెల్లించకపోవడంతో మంగళం ఆర్టీసీ డిపోలో స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఈ రెండు వాహనాలపై కలిపి రూ.6 లక్షల జరిమానా విధించబడింది. తనిఖీల్లో మోటార్ వాహన తనిఖీ అధికారి శ్రీ శ్రీనివాసరావు, అతికానాజ్ తదితరులు పాల్గొన్నారు.



**79 వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా త్రివర్ణ పతాక విద్యుత్ కాంతులతో తిరుపతి కార్యాలయం.**




**తలకోనలో ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి ఫారెస్ట్ మరియు వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ మరియు జేసి శుభం బన్సల్ తదితరులు.**

# "న్యూ మాడ్యూల్ లీగల్ సర్వీసెస్ క్యాంప్"




**కడప పెన్ పవర్ ఆగస్టు 13 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా, గౌరవ డాక్టర్ సి.యామిని, అధ్యక్షులు మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారి సూచనల మేరకు గౌరవ సెక్రటరీ–కం–సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప శ్రీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ వారు కడప నగరం కె ఎస్ ఆర్ ఎం ఇంజనీరింగ్ కళాశాల నందు నల్సా పథకములపై "న్యూ మాడ్యూల్ లీగల్ సర్వీసెస్ క్యాంపు" నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ నల్సా (అక్రమ రవాణా మరియు వాణిజ్య లైంగిక దోపిడీ బాధితులు) పథకం 2015, నల్సా (పిల్లల కోసం పిల్లల–స్నేహపూర్వక చట్టపరమైన సేవలు) పథకం 2024, నల్సా (డ్వాన్ – డ్రగ్ అవగాహన మరియు మాదకద్రవ్య రహిత భారతదేశం కోసం సంక్షేమ నావిగేషన్) పథకం 2025, నల్సా (జాగృతి – గ్రాస్ రూట్స్ సమాచారం మరియు పారదర్శకత చొరవ కోసం న్యాయం అవగాహన) పథకం 2025 లను వివరించారు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, మధ్యవర్తిత్వము, ఉచిత న్యాయ సహాయము, లింగ నిష్పత్తి, లింగ సమానత్వము, ప్రాథమిక హక్కులు మరియు విధులు, విద్యాహక్కు, లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్ట్ 1987, 357 ఏ సి ర్ పిసి, బాల్య న్యాయ చట్టం, పోక్సో చట్టం, బాల్య వివాహాలు చట్టరీత్య నేరము, శిశు సంక్షేమ కమిటీ విధులు, శిశు గృహ విధులు, భారత రాజ్యాంగం, ఆర్టికల్ 21, 1098 హెల్ప్ లైన్, మహిళా హెల్ప్ లైన్ నంబర్ 181, న్యాయ సహాయం కోసం హెల్ప్‌లైన్ – 15100, చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, దివ్యాంగజన్ హెల్ప్ లైన్ నెంబర్ 14456 మొదలు అంశాలను తెలియజేశారు.

**స్టాల్స్ ఏర్పాటు :** గౌరవ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడప వారు, డిస్టిక్ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ వారు, వన్ స్టాప్ సెంటర్ వారు, వైద్య ఆరోగ్యశాఖ వారు, కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ వారు స్టాల్స్ లను ఏర్పాటు చేయడం జరిగినది. స్టాల్ ల ప్రాముఖ్యతను తెలియజేయడం జరిగినది. జిల్లా అధికారులు, ప్రొఫెసర్ లు, ఎన్జీవోలు మరియు కె ఎస్ ఆర్ ఎం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని విద్యార్థులు స్టాల్స్ ను సందర్శించడం జరిగినది. ఈ కార్యక్రమంలో కందుల గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ చంద్ర ఓబుల్ రెడ్డి, డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సుభాష్ యాదవ్, అడిషనల్ డిస్టిక్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ రవిబాబు, కె ఎస్ ఆర్ ఎం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ నాగేశ్వర ప్రసాద్, వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ శ్రీమతి అశ్విని, ప్రొఫెసర్లు, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

### 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా

# మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్

**తిరుపతి, పెన్ పవర్ ఆగస్టు 13 :** ఆగస్టు 15న తిరుపతి జిల్లా తారకరామా స్టేడియం నందు జరగబోయే 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాక ఆవిష్కరణ చేసి, పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించేందుకు దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి గౌరవ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి రానున్నారని జిల్లా కలెక్టర్ తెలిపారు. 14వ తేదీన తాడేపల్లి నుండి రోడ్డు మార్గాన బయలుదేరి తిరుపతి శ్రీ పద్మావతి అతిథి గృహం చేరుకొని రాత్రి బస చేసి తదుపరి ఆగస్టు 15 తేదీన ఉదయం జాతీయ జెండాను ఆవిష్కరణ చేసి తర్వాత ప్రసంగిస్తారని తెలిపారు.

అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు పద్మావతి అతిథి గృహము నుండి బయల్దేరి రేణిగుంట విమానాశ్రయం నుండి ఫ్లైట్లో గంగవరం చేరుకొని అక్కడి నుండి రోడ్డు మార్గాన తాడేపల్లి చేరుకుంటారని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# రెవెన్యూ సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి


### – ఇంచార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ



**అనంతపురం, పెన్ పవర్ ఆగస్టు 13 :** రెవెన్యూ సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని ఇంచార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఆదేశించారు. బుధవారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి రెవెన్యూ& అనుబంధ అంశాలపై ఆర్డీఓలు, తహసీల్దార్లు, రీసర్వే డిటిలు, సంబంధిత అధికారులందరితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇంచార్జి జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మ్యుటేషన్, ఇతర రెవెన్యూ సమస్యలను నిర్దేశిత గడువులోపు పరిష్కారం చేయాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో ఆర్డీవోలు, తహసిల్దార్లు, డిప్యూటీ తహసిల్దార్లు బాధ్యతగా పనిచేయాలని, కిందిస్థాయి ఉద్యోగులతో కూడా పనిచేయించాలన్నారు. రీసర్వేకి సంబంధించి మూడో దశలో పెండింగ్ ఉన్న 250 గ్రామాల్లో ఈనెల 20వ తేదీ నాటికి గ్రామ సరిహద్దులు గుర్తింపు పూర్తిచేయాలని ఆదేశించారు. అదే గ్రామాల్లో ప్రభుత్వ భూముల గుర్తింపు నవంబర్ 15వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. అలాగే ఫీల్డ్ ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ ను సెప్టెంబర్ 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని సూచించారు. రీసర్వేకి సంబంధించి వస్తున్న సిటిజన్ సర్వీసెస్ ను నాణ్యతగా పరిష్కరించాలని ఆదేశించారు. సివిల్ సప్లై అంశాలకు సంబంధించి వచ్చే 15వ తేదీలోపు 100 శాతం సరుకుల పంపిణీ పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఎఫ్.పి షాపుల తనిఖీని కూడా పూర్తిస్థాయిలో చేపట్టాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డిఆర్ఓ ఏ.మలోల, కలెక్టరేట్ సెక్షన్ ల సూపరింటెండెంట్లు యుగేశ్వరిదేవి, రియాజుద్దీన్, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, సర్వే ఏడి రూప్ల నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# హృదయంపై ధ్యానం....

### – సేకరణ సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి




మనం ధ్యానాన్ని (మెడిటేషన్)ఒక మందుగా(మెడికేషన్) లా ఉపయోగించ కూడదు. కాలక్రమేణా ధ్యానం దానంతట అదే మనకు నివారణగా మారుతుంది. మనం ఏమి చేయాలో,ఏలా ఉండాలో సహజంగానే తెలుసుకుంటాము.అలాగే మంచి నిర్ణయాలు తీసుకోగలుగుతాము. అన్ని ధ్యాన పద్ధతులు ఈ విధంగా తెలియజేసినా, మనం చేసే హృదయం పై ధ్యానం ఎక్కువ ప్రభావ మంతమైనదిగా చెప్పవచ్చు. ఎందుకంటే, మధ్యలో ఎటువంటి అవరోధాలకు లోనుకాకుండా సరైన నిర్ణయం దిశగా మనం ముందుకు పోగలం.హృదయంపై



ధ్యానం వల్ల నిరంతరం అభివృద్ధి చెందుతున్న చైతన్యం కారణంగా మనస్సు తనంత తాను మరింత బాగా నియంత్రించుకోగలదు. ఈ విషయం మీకు నిరంతర ధ్యానం ద్వారా మాత్రమే తెలుసుకోగలుగుతారు. (ది పవర్ ఆఫ్ పారడాక్స్ –దాజీ, పార్ట్ 3)

# 60 ఆటో రిక్షాలపై మూడు లక్షల జరిమానా



**తిరుపతి పెన్ పవర్ ఆగస్టు 13 :** తిరుపతి నగరంలో ప్రత్యేకంగా ఆటో రిక్షాలపై పోలీసు మరియు రవాణా శాఖ వారు సంయుక్తంగా వాహన తనిఖీలు చేపట్టడం జరిగింది. ఈ తనిఖీలు రైల్వే స్టేషన్, బస్టాండు మరియు మంగళం రోడ్డులో నిర్వహించ బడ్డాయి. ముఖ్యంగా తిరుపతి నగరంలో భక్తులకు అంటే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని తిరుపతికి విచ్చేసే భక్తులు, పర్యాటకుల గౌరవానికి భంగం కలగకుండా చూడాలని జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ హెచ్చరించారు. వారి ప్రవర్తన, మాటతీరు, డ్రైవింగ్ నైపుణ్యం అన్నీ తిరుపతి నగర ప్రతిష్టను ఇనుమడింప జేయాలని తెలియజేశారు . రహదారిభద్రత ప్రధానంగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని మోటార్ వాహన తనిఖీ అధికారులు తెలియజేశారు. తప్పు ప్రవర్తనకు తగు మూల్యం చెల్లించవలసి ఉంటుందని చట్టపరమైన చర్యలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీలలో మోటర్ వాహనాల తనిఖీ అధికారులు సుబ్రహ్మణ్యం ,శ్రీనివాసరావు, అతికానాజ్, నిఘా విభాగపు తనిఖీ అధికారులు మోహన్ కుమార్ ,రమణ నాయక్, ఆంజనేయ ప్రసాద్ మరియు ట్రాఫిక్ సిఐ భాస్కర్ నాయక్, సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు. ఈ తనిఖీలను ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణ చారి పర్య వేక్షించారు. ఈ సందర్భంగా డిఎస్పి రామకృష్ణ చారి మాట్లాడుతూ ఆటో రిక్షాలపై తనిఖీల్ని నిరంతరం కొనసాగిస్తామని రహదారి భద్రత నియమాలను పాటించాలని తెలియజేశారు. ఈరోజు తనిఖీల్లో భాగంగా 60 ఆటో రిక్షాలపై కేసు నమోదు చేయడం జరిగింది. అపరాధ రుసుముగా రెండు లక్షల రూపాయలు విధించడం జరిగింది. ఆటో రిక్షాలపై అపరాధ రుసుము విధించడమే కాకుండా కౌన్సిలింగ్ నిర్వహించడం గమనార్హం.

## మాదకద్రవ్యాల నివారణ.. అవగాహన

### డాక్టర్ కె.శ్రీనివాసరావు




**కడప పెన్ పవర్ ఆగస్టు 13 :** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు "నషా ముక్త్ భారత్ అభియాన్ " ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్‌లో భాగంగా, యోగి వేమన యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్–9 ప్రోగ్రామ్ ఆఫీసర్ డా.కె. శ్రీనివాసరావు గారి నేతృత్వంలో డ్రగ్స్ అలవాట్లకు వ్యతిరేకంగా సామూహిక ప్రమాణం తీసుకునే కార్యక్రమాన్ని నిర్వహించారు. డ్రగ్స్ వల్ల జరిగే నష్టం గురించి అవగాహన కల్పిస్తూ ప్లకార్డులతో ర్యాలీనిర్వహించారు. మంచి సమాజ నిర్మాణంలో యువత పాత్ర ఎంతో ముఖ్యమైనదన్నారు. మాదక ద్రవ్యాల నివారణకు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ముఖ్యమైన కార్యక్రమం. ఈ కార్యక్రమం ద్వారా మేము ఒక శక్తివంతమైన సందేశాన్ని ఇవ్వాలి–"డ్రగ్స్‌కు కొట్టే చెంపదెబ్బ, జీవితానికి ఇచ్చే గౌరవం" అని. అన్నారు. నషా ముక్త్ భారత్ అభియాన్ యువతను మాదక ద్రవ్యాల బారినుండి దూరం ఉంచడమే నన్నారు. వారి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం ముఖ్య ఉద్దేశ్యం. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఇలా సామూహిక ప్రమాణం తీసుకోవడం, ర్యాలీలు నిర్వహించడం అభినందనీయం. ఇది సమాజంలో మంచి మార్పు తీసుకురాగలదు. మనందరం కలిసికట్టుగా మాదక ద్రవ్యాల వ్యతిరేకంగా పోరాడుతున్న పిలుపునిచ్చారు.

## పిడుగుపాటు, మెరుపు నుండి రక్షణ పొందాలి


### – డిఆర్ఓ ఏ.మలోల

**అనంతపురం, పెన్ పవర్ ఆగస్టు 13 :** పిడుగుపాటు, మెరుపు నుండి రక్షణ పొందడానికి సరళమైన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని డిఆర్ఓ ఏ.మలోల పేర్కొన్నారు. బుధవారం అనంతపురం కలెక్టరేట్ లో జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ (ఏపిఎస్డిఎంఏ) ఆధ్వర్యంలో పిడుగుపాటు భద్రతా రథంను డిఆర్ఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ పిడుగుపాటు, మెరుపు నుండి రక్షణ చర్యలపై అవగాహన కల్పించేందుకు పిడుగుపాటు భద్రతా రథంను ప్రారంభించడం జరిగిందన్నారు. పిడుగుపాటు భద్రతా రథం జిల్లాలోని విడపనకల్లు మండలంలోని పాల్తూరు గ్రామంలో ఈనెల 14వ తేదీన, సింగనమల మండలంలోని ఉల్లికల్లు గ్రామంలో 15వ తేదీన, పెద్దవడుగూరు మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో 16వ తేదీన, డి.హీరేహాల్ మండలంలోని దొడగట్ట గ్రామంలో 17వ తేదీన అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మెరుపు, పిడుగుపాటు గురించిన అపోహలు మరియు సత్యాలు, మెరుపులు వచ్చే ముందు, పిడుగులు పడే సమయంలో, పిడుగులు పడిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరి దేవి, డిజాస్టర్ మేనేజ్మెంట్ డిప్యూటీ తహసీల్దార్ భాష, కలెక్టర్ హెచ్ సెక్షన్ కార్యాలయం సిబ్బంది శ్రీనాథ్ బాబు, శ్రీ తేజ, జిలాన్ భాష, మహమ్మద్ షఫీ, పవన్ కుమార్, పురుషోత్తం, విశ్వనాథ్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

## ఆగష్టు 16న టిటిడి గోసంరక్షణ శాలలో వార్షిక గోపూజ

**తిరుమల పెన్ పవర్ ఆగస్టు 13 :** టిటిడి శ్రీ వేంకటేశ్వర గో సంరక్షణ శాలలో ఆగష్టు 16వ తేదీన గోకులాష్టమి సందర్భంగా వార్షిక గోపూజను నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం రోజున ఉదయం శ్రీ వేణుగోపాల స్వామి వారికి అభిషేకం తదుపరి వేణుగానం, వేద పఠనం తదితర కార్యక్రమాలు చేపడుతారు. అటు తర్వాత శ్రీ వేణుగోపాల స్వామి సన్నిధిలో గోపూజ, హారతి తదితర కైంకర్యాలు చేపడుతారు. ఈ సందర్భంగా టిటిడి వేద పాఠశాల ద్వారా వేద పఠనం, హింధూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్ట్, దాస సాహిత్య ప్రాజెక్ట్ కళాకారుల ద్వారా పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగనున్నాయి.

## అమరావతిలోని ఎస్వీ ఆలయంలో పవిత్రోత్సవాలు



**అమరావతి పెన్ పవర్ ఆగస్టు 13 :** అమరావతిలోని శ్రీ వేంకటేశ్వర ఆలయంలో ఆగష్టు 19 – 21వ తేదీ వరకు పవిత్రోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు టిటిడి ఏర్పాట్లు చేపట్టింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని మహా నగరం అమరావతి ( వేంకటపాలెం)లో టిటిడిచే నిర్మింపబడి, కొలువుతీరి వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం నందు ప్రప్రథమంగా లోక కల్యాణార్థం, సర్వలోకహితార్థం శ్రీ వేఖానస భగవచ్ఛాస్త్రరీత్యా పవిత్రోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. ఆగష్టు 18వ తేదీ సాయంత్రం పవిత్రోత్సవాలకు అంకురార్పణం జరుగనుంది. ఉదయం విశ్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, ఆచార్య ఋత్విక్ వరణము, సేనాధిపతి ఉత్సవం, మృతస్సంగ్రహణం నిర్వహిస్తారు.

ఆగష్టు 19న ఉదయం పంచగవ్యారాధన, అకల్మష హోమం, వాస్తు పూజ, వాస్తు హోమం, స్నపన తిరుమంజనం, సాయంత్రం యాగశాల వైదిక కార్యక్రమాలు, పవిత్ర ప్రతిష్ట అధివాసం, సర్వదైవత్య హోమం చేపడుతారు. ఆగష్టు 20న ఉదయం పుణ్యాహవాచనం, కుంభ ఆరాధన, ప్రధాన హోమములు, స్నపన తిరుమంజనం, పవిత్రాభిమంత్రణ, పవిత్ర సమర్పణము, సాయంత్రం యాగశాల వైదిక కార్యక్రమాలు, మహా శాంతి హోమం, తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు.

ఆగష్టు 21వ తేదీన ఉదయం పుణ్యాహవచనం, యాగశాల వైదిక కార్యక్రమములు, స్నపన తిరుమంజనం, సాయంత్రం యాగశాల వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతి, కుంభ ప్రదక్షిణ, కుంభ సమర్పణం, విశేష ఆరాధన, ఆచార్య, ఆగమ సలహాదారు, ఋత్విక్కులకు బహుమానం, యాజమాన ఆశీర్వాచనం చేపడుతారు.

# ఆ రోడ్డుకు మరమ్మత్తులు చెయ్యండి, మహాప్రభో..!!





**కమలాపురం పెన్ పవర్ ఆగస్టు 13 :** కమలాపురం పట్టణం రైల్వే స్టేషన్ రోడ్డు లో ప్రధాన దారిలో అటు ప్రయాణికులు ఇటు స్థానిక ప్రజలు రోడ్డుపై గుంతలు వలన అనేక కష్టాలను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పట్టణ ప్రజలు స్థానిక అధికారుల పై మండిపడుతున్నారు. నిత్యం అధికారులు ప్రయాణిస్తూనే ఉంటారు కానీ, ఈ రోడ్డు దుస్థితిని చూసి నా కూడా స్పందించలేదని, స్థానిక ప్రజలు ఆరోపణ, ఈ ప్రధాన దారి లో కోగటం, కాజీపేట వెళ్లేందుకు ఈ దారి వెంటే వెళ్లాల్సిన పరిస్థితి ఉన్నందున రోడ్డు గుంతలమయం కావడంతో ప్రయాణికులకు, స్థానిక ప్రజలకు రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం చాలా వరకు ఉంటుందని కొందరు స్థానికులు ఆర్ అండ్ బి అధికారులకు తెలియజేసిన ఫలితం శూన్యం అయితే అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరించడమే కాకుండా మాకెందుకులే అనే ఆలోచన ధోరణిలో ఉన్నట్లు తెలుస్తోందని ప్రయాణికులకు స్థానికులకు ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరూ బాధ్యత వహిస్తారో...?? అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా.. అధికారులుస్పందించి రోడ్డుకు మరమ్మత్తులు చేసేందుకు చర్యలను చేపట్టాలని అధికారులకు స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# పౌష్టికాహారం పంపిణీ - కర్లపాటి ట్రస్ట్



**విజయవాడ పెన్ పవర్ ఆగస్టు 14 :** కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కర్లపాటి పూజ దీపక్ జన్మదినాన్ని పురస్కరించుకొని రక్తహీనతతో బాధపడుతున్న చిన్నారులకు, నిరు పేద మహిళలకు, వయోవృద్ధులకు పదివేల రూపాయల విలువైన పౌష్టికాహారాన్ని శుక్రవారం అందజేయడం జరిగిందని ఆ సంస్థ వ్యవస్థాపకులు, ఎన్టీఆర్ జిల్లా రెడ్ క్రాస్ నిర్వహణ కమిటీ సభ్యులు, సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు తెలిపారు. ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కర్లపాటి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పి ఫోర్ కార్యక్రమంలో తాము కూడా భాగస్వామ్యం కానున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో పట్టణ పరిధిలో గుర్తించిన బంగారు కుటుంబాల్లోని మహిళలకు నైపుణ్యా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించనునట్లు తెలిపారు. కాగా ఈ కార్యక్రమంలో, శ్రేయస్సు సిబ్బంది, రాజశేఖర్, రామచందర్, ట్రస్ట్ సిబ్బంది, పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

**సంతోషం, విజయం, ఆయుర్దాయం,ప్రశంస అనే వాటిని అనుభూతి చెందాలంటే వాటికి వ్యతిరేకమైన బాధ, ఓటమి,మరణం, అవమానం లాంటి వాటిని అనుభవించాలి.అప్పుడే మంచి, చెడు రెంటినీ సమ పాళ్లలో తెలుసుకోగలం. అవన్నీ ఒకే కాలంలో ఉంటాయనే ఎరుక కలిగి ఉండటం హేతుబద్ధంగా ఉంటుంది.**



Shri.S.Krishna Reddy
REGIONAL DIRECTOR, EDUCATIONAL CELL, A.P&TS

# కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ




**వైయస్సార్ కడప పెన్ పవర్, ఆగస్టు 13 :** పులివెందుల, ఒంటిమిట్ట ఉప ఎన్నికల కౌంటింగ్ ఆగస్టు 14న నిర్వహించనున్న నేపథ్యంలో బుధవారం కడప రిమ్స్ సమీపంలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలలో కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌంటింగ్ సిబ్బందికి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో 30 మంది సూపర్వైజర్లు 60 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, ముగ్గురు అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారులకు కౌంటింగ్ ప్రక్రియ పై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డిఆర్వో విశ్వేశ్వర నాయుడు,జెడ్పీ సీఈవో రిటర్నింగ్ అధికారి ఓబులమ్మ, ఏ ఆర్ ఓ లు రంగస్వామి, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# రైతు సేవా కేంద్రాల్లో యూరియా ఖచ్చితంగా అందుబాటులో ఉండాలి

## - జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా





**కర్నూలు, పెన్ పవర్ ఆగస్టు 13 :** వరల్డ్ లార్జెస్ట్ గ్రైన్ స్టోరేజ్ ప్లాన్ కింద ప్రతి మండలంలో కోల్డ్ స్టోరేజ్ యూనిట్ ఏర్పాటుకు రెండెకరాల ప్రభుత్వ భూమిని గుర్తించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ డెవలప్మెంట్ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూమిని గుర్తించే అంశంలో తహసీల్దార్ లతో కో ఆర్డినేట్ చేసుకోవాలని జిల్లా సహకార శాఖ అధికారిని ఆదేశించారు. జిల్లాలో ఉన్న పిఏసి కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పీఎం జన ఔషధీ కేంద్రాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సహకార శాఖ అధికారులను ఆదేశించారు...పి హెచ్ సి మెడికల్ ఆఫీసర్ లతో కో ఆర్డినేట్ చేసుకొని ప్రజలకు జన ఔషధీ కేంద్రాలలో తక్కువ ధరకు మందులు అందుబాటులో ఉంటాయని తెలిసే విధంగా చూడాలన్నారు. డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చే ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో జన ఔషధీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు హాస్పిటల్ సూపరింటెండెంట్ తో మాట్లాడాలని కలెక్టర్ జిల్లా కో ఆపరేటివ్ అధికారి ని ఆదేశించారు.

పిఏసి కేంద్రాల్లో యూరియా విక్రయాలపై తనిఖీ చేయాలని కలెక్టర్ జిల్లా సహకార శాఖ అధికారిని ఆదేశించారు.. డైవర్షన్ జరిగిందా?? లేదంటే ఎక్కువ మోతాదులో ఎవరికైనా అమ్మినారా?? అనే విషయాలను వెరిఫై చేసి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు.. అన్ని రైతు సేవా కేంద్రాల్లో యూరియా ఖచ్చితంగా అందుబాటులో ఉండాలని కలెక్టర్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని ఆదేశించారు. ఫేజ్ 1 లో శాంక్షన్ అయిన మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్ గోడౌన్‌ల నిర్మాణాలు 25 శాతం కంటే తక్కువ నిర్మాణం జరిగిన గోడౌన్‌లు 16 ఉన్నాయన్నారు... వీటిని త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అగ్రికల్చర్&మార్కెటింగ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ను ఆదేశించారు.. గోడౌన్‌లకు రోడ్లను ఏర్పాటుకు సంబంధించి ఉపాధి హామీ నిధుల కింద ఎస్టిమేట్ వేయించి ఎంపిడిఓల ద్వారా పంపించాలని కలెక్టర్ డిసిఓను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. బి.నవ్య, జిల్లా కో ఆపరేటివ్ అధికారి వెంకట కృష్ణ, డిసిసిబి సీఈఓ రామాంజనేయులు, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, డిఆర్‌డిఏ పిడి రమణా రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# మెరుగుపడే దిశగా ప్రయత్నించడానికి మనల్ని మనం ఎలా పరీక్షించుకోవాలి? : డాక్టర్ సునీత





**కన్న పెన్ పవర్ ఆగస్టు 13 :** స్వీయ పరీక్ష దాదాపు 18 సంవత్సరాల వయస్సు ఉన్న ఒక కుర్రవాడు మందుల దుకాణానికి వెళ్లి ఒక ఫోన్ చేసుకోవడానికి అనుమతి అడిగాడు. దుకాణదారుడు కాల్ చేసుకోవడానికి అనుమతి ఇచ్చాడు. తర్వాత ఆ అబ్బాయి ఓ నంబర్ కు డయల్ చేసి మాట్లాడటం మొదలుపెట్టాడు.

వారి సంభాషణ ఇలా కొనసాగింది:

కుర్రవాడు : "హలో మేడమ్, మీ పచ్చికబయలును(లాన్) కత్తిరించే పని నాకు ఇవ్వగలరా?" మహిళ (ఫోన్ లో అవతలి వైపు నుండి) : "క్షమించండి, ఈ పని చేయడానికి ఇప్పటికే నా వద్ద ఇంకొకరు ఉన్నారు." కుర్రవాడు : "మేడమ్, దయచేసి ఒకసారి నా పనితనం చూడండి, మీకు బాగా నచ్చుతుంది." మహిళ : " నాకు అవసరం లేదు, నాయనా!" కుర్రవాడు : "మేడమ్, ఈ పనికి మీరు ప్రస్తుతం ఎంత జీతం ఇస్తున్నారో అందులో సగం ఇవ్వండి చాలు, నేను మీకు ఆ పని చేసి పెడతాను." మహిళ : "లేదు, ప్రస్తుతం నా తోటను చూసుకుంటున్న వ్యక్తి యొక్క పనితనంతో నేను సంతృప్తిగానే ఉన్నాను." కుర్రవాడు : "మేడమ్, దయచేసి నాకు ఉద్యోగం ఇవ్వండి. నేను మీ కాలిబాటను కూడా ఊడుస్తాను. పామ్ బీచ్ లో కెల్లా మీదే చాలా అందమైన పచ్చికబయలు7 (లాన్) ఉండేలా చేస్తాను." మహిళ : " అవసరం లేదు, ధన్యవాదాలు." ఆ కుర్రాడు చిరునవ్వుతో ఫోన్ పెట్టేసాడు. ఇదంతా వింటున్న మందుల దుకాణం యజమాని ఆ అబ్బాయి దగ్గరకు వచ్చి, " నాయనా! పని పట్ల నీ వైఖరి, సానుకూల స్ఫూర్తి నాకు నచ్చాయి, నీకు ఉద్యోగం చాలా అవసరం లా ఉంది... కావాలంటే నా దగ్గర నీకు ఉద్యోగం ఇస్తాను." దానికి ఆ కుర్రాడు "వద్దు సార్, ధన్యవాదాలు" అని బదులిచ్చాడు. యజమానికి ఏమీ అర్థంకాక, అయోమయంగా, "మరి ఇప్పుడే నువ్వు ఫోన్లో ఉద్యోగం కావాలని బ్రతిమాలుతున్నావు కదా", అని అడిగాడు. బాలుడు చిరునవ్వుతో ఇలా సమాధానం చెప్పాడు, "లేదు సార్, నాకు ఉద్యోగం అవసరం లేదు. నేను ప్రస్తుతం చేసున్న ఉద్యోగంలో నా పనితనాన్ని అంచనా వేకుంటున్నాను. నేను నిజంగా ఎక్కడ పని చేస్తున్నానో ఆ మహిళతోనే మాట్లాడుతున్నాను", అని చెప్పి ఆ బాలుడు చిరునవ్వుతో అక్కడి నుండి వెళ్లిపోయాడు, దుకాణదారుడు ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయాడు. మన గురించి మనకంటే బాగా ఎవ్వరూ తెలుసుకోలేరు. ప్రతి క్షణం మన కళ్ళు మనపైనే ఉంటే, మన లోటుపాట్లు మన నుండి దాగవు. ప్రతి క్షణం మరింత మెరుగైన వ్యక్తిగా మారకుండా మనలని ఎవరూ ఆపలేరు. ఏ రంగంలోనైనా విజయం సాధించే బాధ్యత మీపైనే ఉంది. అప్రమత్తంగా ఉండండి, మీ పట్ల మీ బాధ్యతల గురించి తెలుసుకోండి.

**దాజీజీ**
**హార్ట్ ఫుల్ నెస్ ధ్యానం**

# నిజమైన మరణం కంటే ముందే మరణ భయం మనల్ని చంపేస్తుందని మనకు తెలుసా?

## - సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి






**కడప పెన్ పవర్ ఆగస్టు 13 :** జీవించడంలోని కళ ఒక పట్టణంలో ఒక వ్యాపారి ఉండేవాడు. తన స్వదేశంతో పాటు విదేశాల్లో కూడా అతను వ్యాపారం చేసేవాడు. పడ్డ శ్రమ ఫలించడంతో అతను బాగా సంపాదించాడు, త్వరలోనే అతని పేరు నగరంలోని పెద్ద వ్యాపారులలో లెక్కించబడ సాగింది. ఒక రాజభవనాన్ని నిర్మించుకుని, అంగరంగ వైభవంగా, తన కుటుంబ సమేతంగా నివసిస్తూ, అతని జీవితం ఇలా చాలా ఆనందంగా గడిచిపోతూ ఉంది. ఒక రోజు, అతని బంధువులలో ఒకరు మరొక నగరం నుండి వచ్చాడు. సంభాషణ మధ్యలో, తన నగరం యొక్క అత్యంత సంపన్నమైన వ్యాపారి మరణించాడని అతను చెప్తూ, ఆ అభాగ్యుని ఆస్తులు, లక్షల విలువ చేసే ఆస్తి అంతా కూడా పనికిరాకుండాపోయిందని చెప్పాడు. ఈ విషయం అతను చాలా మామూలుగా ప్రస్తావించాడు, కానీ అది వ్యాపారి మనస్సును తీవ్రంగా కదిలించింది. ఆ వ్యాపారిలాగే తాను కూడా ఏదో ఒకరోజు చనిపోతానని అనుకోవడం మొదలుపెట్టాడు. ఆ క్షణం నుంచి మృత్యుభయం అతన్ని వెంటాడడం ప్రారంభించింది. మృత్యువు వస్తుందని, తనని తీసుకెళ్లిపోతుందని, సంపాదించినదంతా ఇక్కడే ఉండిపోతుందన్న ఈ ఆలోచన అతని మనసును వదలలేదు. ఆ ఆందోళన కారణంగా వ్యాపారి కృశించిపోవడం ప్రారంభించాడు. చూసేవాళ్ళకి తనకి ఏ లోటు లేకపోయినట్లనిపించినా, తనలోని బాధ మాత్రం ఎవరికీ చెప్పుకోలేనిది. క్రమంగా, మరణం గురించిన ఆలోచన అతని శరీరాన్ని ఆక్రమించడం ప్రారంభించింది, దీనివల్ల వ్యాపారవేత్త చాలా అనారోగ్యానికి గురయ్యాడు. ఎంత వైద్యం చేయించినా జబ్బు తగ్గకపోగా ఇంకా ముదిరిపోయింది. ఒకరోజు అతని ఇంటికి ఒక సాధువు వచ్చాడు. వ్యాపారి సాధువు పాదాల వద్ద ఏడుస్తూ కూర్చుని తన బాధలన్నింటినీ వివరించాడు. వ్యాపారి కష్టాలు విన్న తర్వాత ఆ వ్యాధికి కారణమేమిటో అర్థం చేసుకుని, సాధువు నవ్వాడు. "నీ జబ్బుకి నివారణ చాలా తేలిక", అని అన్నాడు. వ్యాపారికి పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్లయ్యింది. అతను అసహనంగా ఇలా అడిగాడు, "మహాశయా, ఆ నివారణ ఏమిటి?" సాధువు ఇలా చెప్పాడు, "చూడండి, రాబోయే ఏడు రోజులు మీరు ఒక మంత్రాన్ని పఠించండి. – 'జీవితం ఒక అమూల్యమైన బహుమతి. నేను ప్రతీ క్షణం దానిని జీవిస్తాను.' ఏడు రోజులు, ఉదయం, సాయంత్రం, వీలైనప్పుడల్లా మీ మనస్సులో దీన్ని పునరావృతం చేయండి. మీరు ఎంత ఎక్కువ పునరావృతం చేస్తే, మీరు అంత త్వరగా బాగుపడతారు. నేను వచ్చే వారం మళ్ళీ వస్తాను." ఏడు రోజుల తర్వాత సాధువు అక్కడికి వచ్చినప్పుడు, ఆ వ్యక్తి ముఖఛాయ ప్రకాశవంతంగా మారిపోయి, అతను ఆనందంతో ఉన్నట్లు గమనించాడు. సాధువుని చూసి పరిగెత్తుకుంటూ వచ్చి ఆయన పాదాలపై పడి ఇలా అన్నాడు: "మహాశయా, మీరు నన్ను రక్షించారు! మీ మంత్రం నాపై చాలా ప్రభావం చూపింది. అసలైన మృత్యువు వచ్చిన రోజు మాత్రమే నేను చనిపోతానని అర్థం చేసుకున్నాను. దాని కంటే ముందు ప్రతీ క్షణం, నేను కేవలం మనస్ఫూర్తిగా జీవిస్తాను. మీ నిర్దేశించిన చికిత్సలో ఇంద్రజాలం ఉంది." సాధువు నవ్వుతూ ఇలా అన్నాడు, "మన ఆలోచనలలో మాయాజాలం ఉంది, మనకు జీవించాలనే ఆలోచన ఉంటే, మన జీవితంలోని ప్రతి క్షణం ఉల్లాసంగా మారుతుంది, మనం మరణం గురించి ఆలోచించినట్లయితే, మనం నిజంగా మరణం సమీపించక ముందే చాలాసార్లు చనిపోతాం". ప్రతి క్షణం మన ఆలోచనలను దైవత్వంతో అనుసంధానం చేస్తే, ప్రతి క్షణం మనం దైవత్వం వైపుకు వెళ్తాం. ఇది జీవించడంలో ఉన్న కళ. మన ఆలోచనలే మన విధిని సృష్టిస్తుంది. మన దైనందిన ఆలోచనల ద్వారా మన విధిని సృష్టిస్తాం – అవి మనల్ని ఆకర్షించి, వికర్షించే మన కోరికలు, మన ఇష్టాయిష్టాలు. ??

**దాజీజీ**
**హార్ట్ ఫుల్ నెస్ ధ్యానం**

# ప్రకృతి ఆధారంగా పంటలు పండించండి

## - ఒక్కసారి వాడి వదిలేసే ప్లాస్టిక్ వద్దే వద్దు
## - స్వచ్ భారత్‌ను జయప్రదం చేయండి
## - జేవీ రత్నం వ్యవస్థాపక కార్యదర్శి గ్రీన్ క్లైమేట్ టీం




**విశాఖ పెన్ పవర్ ఆగస్టు 13 :** ప్రకృతి ఆధారంగా పంటలు పండించండి అని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జే వి రత్నం పిలుపునిచ్చారు. ఉదయం పెందుర్తి లోని అలివేలు మంగమ్మ ఆలయంలో గ్రీన్ క్లైమేట్ టీం నేతృత్వంలో కూరగాయ మొక్కలు నారు, ఎపి పిసిబి, కోరమండల్ ఫెర్టిలైజర్స్ గుడ్డ సంచులు పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ దేశ కూరగాయ విత్తనాలతో ఆకుకూరలు, కూరగాయలు పండించుకుని ఆహారంగా తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఒక్కసారి వాడి వదిలేసే ప్లాస్టిక్ వద్దే వద్దన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వనమాలి సిటీజి ఏరియా ఇన్చార్జ్ రేఖ మాట్లాడుతూ పెందుర్తి మండలం లో వందలాది మంది ఇళ్లపై కప్పుల మీద కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నారు న్నారు. వారందరికీ తమ వనమాలి, సీటిజి సంస్థలు విత్తనాలు, నారు ఇచ్చి విభిన్న గ్రూపులకు సహాయ సహకారాలు అందిస్తున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో వేరొక ఇన్చార్జ్ సత్య మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆహారం పండించడం మన చేతల్లోనూ చేతుల్లోనే ఉందన్నారు. రసాయన ఎరువులు క్రిమిసంహారకాలు లేకుండా ప్రతి ఒక్కరు కూరగాయలు పండించి తమ పిల్లలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించాలన్నారు. మన పిల్లల ఆరోగ్యం అన్నది మన బంగారు భవిష్యత్తు అని గుర్తుంచుకోవాలన్నారు. విత్తనాలు ఇచ్చిపుచ్చుకునే విధానంలో అందరికీ అందజేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వందలాది మంది మహిళలు, గ్రీన్ క్లైమేట్ టీమ్ ఎన్జీవో కోఆర్డినేటర్ జె రాజేశ్వరి, యాక్షన్ ఎయిడ్ కర్ణాటక సంస్థ అనకాపల్లి ఫెసిలిటేటర్ ఐ కృష్ణకుమారి తదితరులు మాట్లాడారు.

# వినాయక నిమజ్జనం ఉత్సవం సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేయండి

## - జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా




**కర్నూలు, పెన్ పవర్ ఆగస్టు13 :** సెప్టెంబర్ 4వ తేదీన నిర్వహించనున్న వినాయక నిమజ్జనం ఉత్సవం సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ 4 వ తేదీన వినాయక నిమజ్జన ఉత్సవం సందర్భంగా ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో బుధవారం జిల్లా కలెక్టర్ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వినాయక నిమజ్జనం ఉత్సవ నిర్వహణ కు సంబంధించి ఆయా శాఖలకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. శాంతి భద్రతలకు సంబంధించి ఎలాంటి సమస్యలు రాకుండా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. నిమజ్జనానికి ముందు రోజు నుండి మద్యం అమ్మకాలు జరగకుండా డ్రై డే పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ అధికారులను ఆదేశించారు.

బారికేడింగ్ ఏర్పాట్లు చేయాలని రోడ్లు మరియు భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. కెసి కెనాల్‌లో నీటి ప్రవాహం నిమజ్జనానికి తగినట్లుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. విగ్రహాల నిమజ్జనానికి తగినన్ని క్రేన్ కు, డ్రైవర్లు, మెకానిక్‌లు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

క్రేన్ లకు ఫిట్నెస్ ఉందా లేదా చెక్ చేసి సర్టిఫై చేయాలని ట్రాన్స్పోర్ట్ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు..నిమజ్జన మార్గంలో కిందకు వేలాడి ఉన్న కరెంట్ తీగలు అడ్డు రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు..ఘాట్ల వద్ద లైఫ్ జాకెట్ లు, బోట్లు, గజ ఈతగాళ్లు అందుబాటులో ఉండే విధంగా మత్స్య శాఖ అధికారి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లైఫ్ జాకెట్, ఫైర్ వెహికల్స్, లైఫ్ బాయ్స్, రెస్క్యూ టీమ్ లను కూడా అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాని అగ్నిమాపక శాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఘాట్ల వద్ద అంబులెన్స్, మెడికల్ క్యాంపు లను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డిఎంహెచ్ఓ ని అదేశించారు. అలాగే పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు..నిమజ్జనం సమయంలో కేబుల్ వైర్లు తగలకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కర్నూలు ఆర్డీఓ,మున్సిపల్ కమిషనర్, డీఎస్పీ నిమజ్జన మార్గాన్ని పరిశీలించి, సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు అన్ని ప్రాంతాల్లో నిమజ్జనోత్సవం ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ... జిల్లాలో అన్ని ప్రాంతాల్లో జరిగే నిమజ్జనోత్సవానికి పోలీస్ శాఖ పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేస్తుందని తెలిపారు..వినాయక నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించేలా పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్పీ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు..పర్మిషన్ ఇచ్చిన విధంగా మండపాల ఏర్పాటు, నిమజ్జనం జరిగేలా చూడాలన్నారు. వినాయక మండపాలలో సీసీటీవీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించేలా రోడ్లపై వినాయక విగ్రహాలు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు నిమజ్జనం సందర్భంగా ప్రభుత్వ పరంగా తీసుకోవలసిన పలు అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సమావేశంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిఆర్‌ఓ వెంకట నారాయణమ్మ,అడిషనల్ ఎస్ పి హుసేన్ పీరా, జడ్పీ సీఈవో నాసర రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ ఈ నాగేశ్వరరావు, కర్నూలు ఆర్డీఓ సందీప్ నాయక్, పత్తికొండ ఆర్డిఓ భరత్ నాయక్, డీఎస్పీ బాబూ ప్రసాద్, ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ ఈ ఉమాపతి, డి ఎం అండ్ హెచ్ ఓ శాంతి కళ, డిటిసి శాంత కుమారి ఇతర జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు, కర్నూలు జిల్లా గణేష్ ఉత్సవ సమితి కమిటీ అధ్యక్షులు వేణుగోపాల్, కార్యదర్శి గోరంట్ల రమణ, కర్నూలు నగర అధ్యక్షులు రంగస్వామి, కార్యదర్శి గిరిరాజు వర్మ, జిల్లా సమన్వయ కార్యదర్శి నాగఫణి శాస్త్రి, సహ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, పత్తికొండ నుంచి గోవర్ధన్, ఆదోని నుండి నీలకంఠ, కోడుమూరు నుండి కిరణ్, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# జనసేనలోయువతభారీ చేరకలు





**జనసేన పార్టీ విధి విధానాలు సిద్ధాంతాలు నచ్చి. పార్టీలో చేరిన పెదపూడి మధు**

**చింతపల్లి పెన్ పవర్ ఆగష్టు 13:-** చింతపల్లి మండలంలో జనసేన పార్టీ కార్యకర్తల బలోపేతం సమావేశంలో. ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు పంచకర్ల రమేష్ బాబు. జనసేన పార్టీ అరకు పార్లమెంట్ ఇంచార్జ్ మరియు పాడేరు నియోజకవర్గ ఇన్చార్జ్ వంపూ రి గంగయ్య సమక్షంలో
జనసేన నూతన అభ్యర్థులు భారీ సంఖ్యలో చేరారు.

ఈ సందర్భంగా. శాసన సభ్యులు రమేష్ బాబు ఆయన మాట్లాడుతూ. జనసేన పార్టీ మన అధినాయకుడు పవన్ కళ్యాణ్ ప్రజల సమస్యల పట్ల నిత్యం పోరాడుతూ సమస్య పరిష్కార దిశగా ఆయన ముందడుగు వేస్తూ రాష్ట్ర అభివృద్ధి కొరకు పని చేస్తున్నారని ఆయన అన్నారు. జనసేన పార్టీ సిద్ధాంతం విధివిధానాలు నచ్చి. నూతన అభ్యర్థులుగా మన్యప్రాంత అభివృద్ధి పార్టీ బలోపేతం కోసం పనిచేయాలని ఆయన కార్యకర్తలను ఉద్దేశించి పిలుపునిచ్చారు. కష్టపడి పని చేసే ప్రతి ఒక్కరికి పార్టీ ఎప్పుడు గుర్తుపెట్టుకుని. జనసేన పార్టీ ఉన్నత స్థానం కల్పిస్తుందని నూతన అభ్యర్థి పెదపూడి మధు కు ఆయన మాటల్లోభరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు చింతపల్లి మండల అధ్యక్షకుడు వంతల బుచ్చిబాబు. జిల్లా కార్యదర్శి ఉల్లి సీతారాం. గొర్ల వీర వెంకట్ సుర్ల వీరేంద్ర కుమార్. గాజుల శ్రీను జనసేన పార్టీ సీనియర్ నాయకులు నూతన అభ్యర్థులు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేశారు.

## జానపద కళలు సృజనాత్మక అకాడమీ చైర్మన్ గా నియమితులైన గంగులయ్యకు శుభాకాంక్షలు



**నమ్ముకున్న వారికి జనసేన పార్టీలో సముచిత స్థానం**

**అల్లూరి జిల్లా కార్యదర్శి ఉల్లి సీతారాం బృందం.**

**చింతపల్లి పెన్ పవర్ ఆగష్టు 13:-** అరకు పార్లమెంట్ ఇంచార్జ్, పాడేరునియోజకవర్గం ఒంపూరు గంగులయ్య జానపద కళలు, సృజనాత్మక అకాడమీ చైర్మన్ గా నియమితులైన సందర్భంగా గంగులయ్య ను పాడేరులో ఆ పార్టీ అల్లూరి జిల్లా కార్యదర్శి ఉల్లి సీతారాం ఆ పార్టీ నాయకులతో కలిసి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్చం అందించి, దుస్సాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉల్లి సీతారాం మాట్లాడుతూ శ్రమించిన ప్రతి ఒక్కరికి జనసేన పార్టీలో సముచిత స్థానం ఉంటుంది అనడానికి గంగులయ్య కు జానపద కళలు, సృజనాత్మక అకాడమీ చైర్మన్ గా నియమించడమే ఉదాహరణ అన్నారు. కూటమి ప్రభుత్వంలో తెదేపా, బీజేపీ లతోపాటు జనసేన పార్టీ కీలక పాత్ర పోషిస్తున్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఈ క్రమంలో పాడేరు నియోజకవర్గానికి సంబంధించిన పార్టీ సీనియర్ నేతగా గుర్తింపు ఉన్న ఒంపూరు గంగులయ్య కు జానపద కళలు, సృజనాత్మక అకాడమీ చైర్మన్ పదవిని కల్పించి పార్టీలో సముచిత స్థానం ఇచ్చిన పార్టీ అధ్యక్షుడు ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తో పాటు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఈ సందర్భంగా గంగులయ్యతోపాటు పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు ఉగ్రంగి లక్ష్మణరావు, దూనబోయిన రమణ, చింతపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కిముడు కృష్ణమూర్తి (పండు), ఇతర నాయకులు పాల్గొన్నారు.

## జానపద కళలు సృజనాత్మక అకాడమీ చైర్మన్ గా నియమితులైన గంగులయ్యకు శుభాకాంక్షలు



**నమ్ముకున్న వారికి జనసేన పార్టీలో సముచిత స్థానం**

**అల్లూరి జిల్లా కార్యదర్శి ఉల్లి సీతారాం బృందం.**

**చింతపల్లి పెన్ పవర్ ఆగష్టు 12:-** అరకు పార్లమెంట్ ఇంచార్జ్, పాడేరునియోజకవర్గం ఒంపూరు గంగులయ్య జానపద కళలు, సృజనాత్మక అకాడమీ చైర్మన్ గా నియమితులైన సందర్భంగా గంగులయ్య ను పాడేరులో ఆ పార్టీ అల్లూరి జిల్లా కార్యదర్శి ఉల్లి సీతారాం ఆ పార్టీ నాయకులతో కలిసి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్చం అందించి, దుస్సాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉల్లి సీతారాం మాట్లాడుతూ శ్రమించిన ప్రతి ఒక్కరికి జనసేన పార్టీలో సముచిత స్థానం ఉంటుంది అనడానికి గంగులయ్య కు జానపద కళలు, సృజనాత్మక అకాడమీ చైర్మన్ గా నియమించడమే ఉదాహరణ అన్నారు. కూటమి ప్రభుత్వంలో తెదేపా, బీజేపీ లతోపాటు జనసేన పార్టీ కీలక పాత్ర పోషిస్తున్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఈ క్రమంలో పాడేరు నియోజకవర్గానికి సంబంధించిన పార్టీ సీనియర్ నేతగా గుర్తింపు ఉన్న ఒంపూరు గంగులయ్య కు జానపద కళలు, సృజనాత్మక అకాడమీ చైర్మన్ పదవిని కల్పించి పార్టీలో సముచిత స్థానం ఇచ్చిన పార్టీ అధ్యక్షుడు ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తో పాటు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఈ సందర్భంగా గంగులయ్యతోపాటు పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు ఉగ్రంగి లక్ష్మణరావు, దూనబోయిన రమణ, చింతపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కిముడు కృష్ణమూర్తి (పండు), ఇతర నాయకులు పాల్గొన్నారు.

## లంబసింగిలో సారా వద్దు ఆరోగ్యం ముద్దు అవగాహన సదస్సులు






**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 13:-**చింతపల్లి మండలంలంబసింగి గ్రామంలో సారా వద్దు ఆరోగ్యం ముద్దు అవగాహన సదస్సుకుముఖ్య అతిథిగా విచ్చేసిన ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీరామచంద్రమూర్తి ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యవంతులు కావాలని ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి దిశలో ప్రజలకు వివిధ రకాలుగా అందించుటకు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో నవోదయం కార్యక్రమం ద్వారా చేపడుతున్నామన్నారు,

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సర్కిల్ ఇన్స్పెక్టర్ జె కూర్మా రావు మాట్లాడుతూనాటు సారాలు తయారుచేసిన అమ్మకాలు చేపట్టిన నల్లబెల్లాలు అమ్మోనియాలు వ్యాపారుల పైన కేసులు నమోదు చేస్తామన్నారు ప్రజల నుంచి వచ్చిన ఏ ఫిర్యాదుఅయినా స్వీకరిస్తామనివారి యొక్కపేర్లనుగోప్యంగా ఉంచుతామన్నారు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీరామచంద్రమూర్తి ఈ ప్రాంతాలలో వివిధ రంగాల వారితో గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి కమిటీలు ద్వారా నాటు సారా, గంజాయి అరికట్టేందుకు ప్రజలు ప్రభుత్వానికిసహకరించాలన్నారు,యువతఈప్రాంతాలలో ఎంతోమంది మత్తుకు బానిసై అనారోగ్య పాలవుతున్నారన్నారు, అంతా డిజిటల్ టెక్నాలజీ సెల్ ఫోన్ ద్వారా చాలా స్పీడ్ గా వైరల్ అవుతుందన్నారు

ప్రజలు ఇచ్చే సమాచారము ద్వారా స్థానిక పోలీస్ స్టేషన్లో పరిధిలో ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోనేరుగా ఫిర్యాదులు చేసుకోవచ్చున్నారు సారా కేసులు పట్టుబడితే ఒక సంవత్సరం వరకు జైలు జీవితం అనుభవిస్తూ లక్ష రూపాయలు జరిమాన విధిస్తామని అలాగే ప్రభుత్వం నుండి తీసుకుంటున్న సంక్షేమ పథకాలు నిలుపుదల చేస్తామన్నారు, అదేవిధంగా వారి యొక్క ఆస్తులు కూడా జప్తు చేసేందుకు ప్రభుత్వము వెనకాడదని అన్నారు.ఈ కార్యక్రమంలో చింతపల్లి ఎస్సై వెంకటరమణ, డిప్యూటీ తాసిల్దార్, లంబసింగి మెడికల్ ఆఫీసర్, ఎక్సైజ్ ఎస్సై రాంబాబు, లంబసింగి సచివాలయం కార్యదర్శి అప్పలరాజు, సూపర్ సర్పంచ్ రఘునాథ్, మహిళ పోలీస్,

మహిళలు యువకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అయ్యా అధికారులు కాస్త మా గ్రామాన్ని పట్టించుకోండి





- ఆదివాసి గిరిజన మహిళా సంఘం హుకుంపేట మండల కమిటి
- త్రాగునీటి కోసం కాలి బిందెలతో ఆందోళన.
- వీధి లైట్లు సీసీ రోడ్లు,డ్రైనేజ్ లు నిర్మించాలి

**పెన్ పవర్ హుకుంపేట ఆగష్టు 13:**అల్లూరి జిల్లా హుకుంపేట మండలం ఆగస్ట్ 13: మండల కేంద్రం హుకుంపేట గ్రామానికి త్రాగునీరు సదుపాయం కల్పించాలని, అంటూ ఆదివాసి గిరిజన మహిళా సంఘం ఆధ్వర్యంలో కాళీ బిందెలతో గిరిజన సంఘం కార్యాలయం నుండి మండల పరిషత్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం జిల్లా పంచాయితీ అధికారి,మండల స్పెషల్ ఆఫీసర్ కె పి చంద్రశేఖర్ నీ అడ్డుకొని పెద్దఎత్తున నినాదాలు చేశారు, పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందించినట్టు సంఘ జిల్లా కార్యదర్శి ఎస్ హైమావతి,మండల కార్యదర్శి కె అరుణ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలకేంద్రం హుకుంపేట మేజర్ పంచాయతీలో గత ఐదు సంవత్సరాల నుండి సురక్షితమైన త్రాగునీరు అందించడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేసారు అని మండిపడ్డారు. అలాగే వీధి వీధకి పైపులు,కొళాయిలు బిగించిన గుత్తేదారులకు బిల్లులు చెల్లించి నీళ్ళు సరఫరా చేయడం మరిచారు అని ఎద్దేవా చేశారు సిపిఎం కాలనీ,మొదమాంబ కాలనీ,నీలగడ్డ వీధులకు ఇప్పటికీ చుక్క నీరు కూడా అందించలేదు అన్నారు.విధి లైట్లు, ఏర్పాటు చేయడం,సీసీ రోడ్లు,డ్రైనేజ్ లు నిర్మించడంలో ప్రజాల అవసరాలను పక్కన పెట్టి పంచాయితీ అధికారులు ఇష్టాను రాజ్య నిర్మాణాలు చేపడుతున్నారు. అని అన్నారు.ఈ కార్యక్రమానికి గిరిజన సంఘం మండల కార్యదర్శి టి క్రిష్ణరావు,నీలమ్మ, మణి,పంతులమ్మ, గౌరీ, కీర్తన మంజుల, శైలజ సుజాత తదితరులు పాల్గొన్నారు.

## మూడు పంచాయతీల్లో పీసా ఎన్నికలు..!

**ఎంపీడీవో జీడివి ప్రసాదరావు ప్రకటన**

**కొయ్యూరు,పెన్ పవర్ ఆగస్టు13:**ఈనెల 22నుండి 26 మధ్యలో మండలంలోని రేవళ్ల, కినపర్తి రాజేంద్రపాలెం పంచాయతీలలో పిసా ఉపాధ్యక్ష, కార్యదర్శి ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో జీడివి ప్రసాద్ రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజేంద్రపాలెం, కినపర్తిలో ఉపాధ్యక్షుడు, కార్యదర్శి అలాగే రేవళ్లలో ఉపాధ్యక్షుడు పదవులకు ఎన్నికలు నిర్వహించ నున్నట్లు వివరించారు. కినపర్తి లో ఏ ఎస్ ఓ కె.చైతన్య, రాజేంద్రపాలెంలో బాలికల ఆశ్రమ స్కూల్ హెచ్ఎం సిహెచ్ గోపాలం, రేవళ్లు లో సిడిపిఓ ఎల్.దేవమణి ప్రిసైడింగ్ అధికారులుగా వ్యవహరించనున్నట్టు ఆయన వివరించారు. 18న ఉదయం 11 గంటలకు ఈ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రిసైడింగ్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో తెలిపారు.




## పిఎసిఎస్ చైర్మన్, వైస్ చైర్మన్లు ప్రజాసేవకే అంకితం కావాలి



**ముంచంగిపుట్టు మండల పిఏ సిఎస్ చైర్మన్, వైస్ చైర్మన్ లను సన్మానించిన రాష్ట్ర జిసిసి చైర్మన్ శ్రావణ్ కుమార్.**

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు13.**ముంచంగిపుట్టు మండల పిఏ సిఎస్ చైర్మన్ సామల బాబూజీ, వైస్ చైర్మన్ రొబ్బ గణపతి లకు రాష్ట్ర జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ పాడేరు తన క్యాంపు కార్యాలయంలో ఇరువురిని దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నియమించిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం త్రిసభ్య కమిటీలో చైర్మన్, వైస్ చైర్మన్ లుగా ప్రభుత్వం మీపై నమ్మకంతో ఇచ్చిన పదవిని వమ్ము చేయకుండా ప్రజా సేవ చేయడానికి ప్రయత్నం చేయాలని, ఇలాంటి పదవులు ఇంకా ఎన్నెన్నో అధిరోహించాలని, ప్రజా పక్షాన ఉంటూ ప్రజలకు సేవ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బాకూరు సర్పంచ్ వెంకటరమణ రాజు, మాజీ జెడ్పీటీసి సుబ్బారావు, దారెలా సర్పంచ్ పాండురంగ స్వామి ముంచంగిపుట్టు మండల అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ, కార్యదర్శి జగత్రాయ్, మండల టిడిపి నాయకులు బలరాం, రామమూర్తి, సర్పంచ్ లక్ష్మణ్, క్లస్టర్ ఇంచార్జి మజ్జి చిన్ని, కామేష్, రామారావు, మురళి, రవి తదితరులు పాల్గొన్నారు.



## డాక్టర్ వంపూరు గంగులయ్యను సన్మానించిన జీకే వీధి జనసేన నాయకులు



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఆగస్టు 13:** జనసేన పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ వంపూరు గంగులయ్యను కూటమి ప్రభుత్వం జానపద కళలు మరియు సృజనాత్మకత అకాడమీ చైర్మన్గా నియమించిన శుభ సందర్భంగా గూడెం కొత్తవీధి మండల జనసేన పార్టీ నాయకులు పాడేరు వెళ్లి గంగులయ్యను అభినందిస్తూ దుస్సాల్వను కప్పి అభినందించారు. భవిష్యత్తులో గంగులయ్య మరిన్ని ఉన్నత పదవులను చేపట్టి రాజకీయంగా ఎదగాలని, గిరిజన ప్రాంత అభివృద్ధికి తమ సేవలు కొనసాగించాలని ఆకాంక్ష వ్యక్తపరిచారు. అలాగే గంగులయ్యకు నామినేటెడ్ చైర్మన్ పదవి అందించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, జనసేన పార్టీ అధినేత,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లే వీర వెంకట్, మాజీ పిఏసిఎస్ చైర్మన్ వసుపరి ప్రసాద్, సోషల్ మీడియా ఇంచార్జ్ సిద్ధూ, పెదవలస పంచాయతీ జనసేన అధ్యక్షులు వీరోజి త్రిమూర్తులు, వంచుల పంచాయితీ జనసేన అధ్యక్షులు గుండ్ల రఘు వంశీ, రింతాడ పంచాయతీ ఉపాధ్యక్షులు అనిల్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## హర్ ఘర్ తిరంగా ర్యాలీ. ఉత్సాహంగా నిర్వహణ




**పెన్ పవర్ హుకుంపేట , ఆగస్టు 13:** హుకుంపేట మండల కేంద్రంలో హర్గర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. హుకుంపేట జ్ఞాన సాగర్ కళాశాల మరియు ప్రభుత్వ కళాశాల మరియు వివిధ పాఠశాల విద్యార్థులతో హర్గర్థిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. భారత్ మాతాకీ జై. అంటూ నినాదాలు చేస్తూ దేశభక్తిని చాటారు. అలాగే దేశం కోసం త్యాగాలు చేసిన మహానీయు లను వారి సేవలను స్మరించుకుంటూ, వారి అడుగు జాడల్లో నడుచుకోవాలని ర్యాలీలో పాల్గొన్న వారు అన్నారు. మాతృభూమి రుణం తీర్చుకునే విధంగా. ప్రతి పౌరుడూ తన వంతు బాధ్యతను నిర్వర్తించాలి, అని సందేశాన్ని చాటారు . ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ స్కూల్ విద్యార్థులు టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# వీధి కుక్కలపై సెలబ్రెటీల పోస్టులు.. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ స్పందన



**హైదరాబాద్ పెన్ పవర్:** దేశంలో వీధి కుక్కల సమస్య చాలా కాలంగా చర్చనీయాంశంగా ఉంది. దీనిపై ప్రజల భద్రత, జంతు హక్కుల మధ్య తీవ్రమైన వైరుధ్యం ఎప్పుడూ ఉంటుంది. ఇటీవల ఈ సమస్యపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఒక తీర్పు దేశవ్యాప్తంగా పెద్ద దుమారాన్ని సృష్టించింది. ఈ తీర్పుపై వచ్చిన వ్యతిరేకత, దాని తర్వాత పరిణామాలను విశ్లేషిద్దాం.

**సుప్రీంకోర్టు తీర్పు సారాంశం**

జస్టిస్ జేబీ పార్దివాలా, ఆర్. మహదేవన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం దేశ రాజధాని ఢిల్లీలో వీధి కుక్కలను పూర్తిగా తొలగించాలని ఆదేశించింది. ఈ ప్రక్రియను 8 వారాల్లోగా పూర్తి చేయాలని ఎవరైనా అడ్డుకుంటే కఠిన చర్యలు తీసుకోవాలని కోర్టు స్పష్టం చేసింది. ఈ నిర్ణయానికి ప్రధాన కారణాలుగా పిల్లల ప్రాణ భద్రత, రేబిస్ వ్యాప్తి నివారణను కోర్టు పేర్కొంది. ఈ తీర్పుతో చాలా మంది ప్రజలు ఊరట చెందగా జంతు ప్రేమికులలో ఆందోళన మొదలైంది.

**తీర్పుపై తీవ్ర వ్యతిరేకత**

సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. జంతు ప్రేమికులు, సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు ఈ తీర్పును తీవ్రంగా వ్యతిరేకించారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ, బీజేపీ సీనియర్ నేత, జంతు హక్కుల కార్యకర్త మేనకా గాంధీ ఈ తీర్పును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ తీర్పు అమానవీయమని, వీధి కుక్కలను తొలగించడం సమస్యకు పరిష్కారం కాదని వారు పేర్కొన్నారు. సోషల్ మీడియా వేదికగా "జస్టిస్ ఫర్ డాగ్స్" వంటి హ్యాష్‌ట్యాగ్‌లు ట్రెండింగ్‌లోకి వచ్చాయి. వేలమంది ప్రజలు తీర్పుకు వ్యతిరేకంగా తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద పౌర సంఘాలు.. జంతు హక్కుల కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ నిరసనలన్నీ సుప్రీంకోర్టు తీర్పులోని కఠినమైన అంశాలపై దృష్టి సారించాయి. వీధి కుక్కలను చంపేయడం అనేది ఒక క్రూరమైన చర్య అని, వాటిని క్రమబద్ధీకరించడం , టీకాలు వేయడం వంటి ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయని వ్యతిరేక వర్గం వాదించింది.

**సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి హామీ**

దేశవ్యాప్త వ్యతిరేకత.. నిరసనల నేపథ్యంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్. గవాయ్ ఒక కీలకమైన ప్రకటన చేశారు. ఈ విషయం తన దృష్టికి వచ్చిన వెంటనే తీర్పును పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమస్యను లోతుగా అధ్యయనం చేసి, తగిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రకటన జంతు ప్రేమికులకు మరియు కార్యకర్తలకు ఒక పెద్ద ఊరటనిచ్చింది.

**ఇతర రాష్ట్రాల స్పందన**

సుప్రీంకోర్టు తీర్పు ప్రభావం ఇతర రాష్ట్రాలపై కూడా పడింది. ఉదాహరణకు రాజస్థాన్ హైకోర్టు కూడా ఇదే తరహాలో స్పందించింది. ప్రజల భద్రత కోసం తమ రాష్ట్రంలో కూడా తక్షణమే వీధి కుక్కలను తొలగించాలని మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఇది దేశవ్యాప్తంగా వీధి కుక్కల సమస్యపై ఒక కొత్త చర్చకు దారితీసింది.

**భవిష్యత్తులో ఏం జరగవచ్చు?**

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఇచ్చిన హామీతో ఈ తీర్పులో మార్పులు జరిగే అవకాశం ఉంది. రాబోయే రోజుల్లో కోర్టు కింది అంశాలను పరిగణనలోకి తీసుకోవచ్చు. వీధి కుక్కలను తొలగించకుండా వాటిని క్రమబద్ధీకరించడం, టీకాలు వేయడం వంటి మార్గాలను ప్రోత్సహించడం ముఖ్యం. ప్రజల భద్రత , జంతు హక్కుల మధ్య సమతుల్యం సాధించే ఒక కొత్త విధానాన్ని రూపొందించడం అవసరం. స్థానిక సంస్థలు (మున్సిపాలిటీలు) ఈ సమస్యను పరిష్కరించడంలో తమ బాధ్యతను మరింత సమర్థవంతంగా నిర్వర్తించేలా మార్గదర్శకాలు ఇవ్వడం ముఖ్యం.

వీధి కుక్కల సమస్య ఒక క్లిష్టమైన సమస్య. ఇది కేవలం ఒక పట్టణ సమస్య కాదు, ఒక సామాజిక మరియు నైతిక సమస్య కూడా. ప్రజల భద్రతను కాపాడటంతో పాటు, జంతువుల పట్ల కనికరం చూపడం కూడా చాలా ముఖ్యం. రాబోయే రోజుల్లో సుప్రీంకోర్టు తీసుకునే నిర్ణయం ఈ రెండు అంశాలను ఎలా సమతుల్యం చేస్తుందో వేచి చూడాలి.

# ధోని ఫ్రెండ్ కు బిగుస్తున్న ఈడీ ఉచ్చు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆన్‌లైన్ అక్రమ బెట్టింగ్ యాప్‌లపై దేశవ్యాప్తంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తన దర్యాప్తును వేగవంతం చేసింది. ఇప్పటికే పలువురు సినీ, క్రీడా ప్రముఖులను విచారించిన ఈడీ, తాజాగా భారత మాజీ క్రికెటర్ 'మిస్టర్ ఐపీఎల్' సురేష్ రైనాకు సమన్లు జారీ చేయడంతో ఈ కేసు మరో కీలక మలుపు తిరిగింది. రైనా 1xBet అనే బెట్టింగ్ యాప్‌కు ప్రచారకర్తగా వ్యవహరించాడనే ఆరోపణలు, ఈ యాప్ ద్వారా జరిగిన భారీ ఆర్థిక లావాదేవీలు, మనీలాండరింగ్ వ్యవహారాలపై ఈడీ ప్రధానంగా దృష్టి సారించింది. సురేష్ రైనా 1xBet అనే ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌తో కలిసి పనిచేశారనే ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఈ యాప్ ద్వారా వేల కోట్ల రూపాయల అక్రమ లావాదేవీలు, మనీలాండరింగ్ జరిగినట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ఈ యాప్‌ను ప్రమోట్ చేయడంలో రైనా పాత్ర ఎంతవరకు ఉంది? దీనికోసం ఆయనకు ఎంత మొత్తం చెల్లించారు? ఒప్పందాలు ఎలా జరిగాయి? వంటి విషయాలను తెలుసుకునేందుకు ఈడీ రైనాను విచారణకు పిలిచింది. ఢిల్లీలోని ఈడీ ప్రధాన కార్యాలయంలో ఈ విచారణ జరగనుంది. ఈ విచారణలో రైనా ఈ యాప్‌తో తనకున్న సంబంధాలపై వివరణ ఇవ్వాల్సి ఉంటుంది.

**ప్రముఖుల ప్రచారం, యువతపై ప్రభావం**

నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ప్రముఖుల ప్రచారం వల్ల అక్రమ బెట్టింగ్ యాప్‌లకు ఒక రకమైన విశ్వసనీయత లభిస్తుంది. సురేష్ రైనా వంటి క్రికెట్ దిగ్గజాలు, ఇతర సినీ ప్రముఖులు ఈ యాప్‌లను ప్రమోట్ చేయడం వల్ల యువత, అభిమానులు వాటిపై సులభంగా నమ్మకం పెట్టుకుంటారు. ఈ నమ్మకం చివరికి వారిని బెట్టింగ్ వైపు ఆకర్షిస్తుంది. ఇది కేవలం ఆర్థిక మోసాలకు మాత్రమే కాకుండా, అనేక మంది యువత భవిష్యత్తును నాశనం చేస్తోందని ఈడీ ఇప్పటికే స్పష్టం చేసింది. బెట్టింగ్ యాప్‌ల ప్రచారం దేశవ్యాప్తంగా వేల కోట్ల రూపాయల మోసాలకు కారణమవుతోందని, ఈ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఈడీ వర్గాలు పేర్కొంటున్నాయి.

**ఇప్పటికే విచారణ ఎదుర్కొన్న ప్రముఖులు**

సురేష్ రైనాకు సమన్లు జారీ చేయడం ఈ కేసులో మొదటిసారి కాదు. ఇప్పటికే ఇదే కేసులో పలువురు సినీ ప్రముఖులను తెలంగాణ పోలీసులు, ఈడీ అధికారులు ప్రశ్నించారు. వీరిలో నటులు రానా దగ్గుబాటి, ప్రకాష్ రాజ్, మంచు లక్ష్మి వంటివారు ఉన్నారు. ఈ విచారణలో వారు బెట్టింగ్ యాప్‌లతో తమకు ఉన్న సంబంధాలపై సమాధానం ఇవ్వాల్సి వచ్చింది. ఇప్పుడు సురేష్ రైనా విచారణతో ఈ కేసులో మరిన్ని కొత్త విషయాలు బయటకు వచ్చే అవకాశం ఉంది.

# వంగి కొబ్బరికాయ కొట్టలేని జగన్.. చంద్రబాబు వయసు గురించి మాట్లాడడమా?

వైసీపీ అధినేత జగన్ పై సర్వేపల్లి టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కనీసం వంగి కొబ్బరికాయ కొట్టలేని జగన్, నిరంతరం ప్రజాసేవలో ఉండే చంద్రబాబు వయసు గురించి మాట్లాడడమా! అంటూ ఎద్దేవా చేశారు. బుధవారం నాడు నెల్లూరులో మీడియాతో మాట్లాడిన సోమిరెడ్డి, జగన్ తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. "గత 30 ఏళ్లలో తొలిసారిగా పులివెందులలో జడ్పీటీసీ ఎన్నికలకు నామినేషన్లు వేసి, పోలింగ్ నిర్వహించే పరిస్థితి వచ్చింది. తమ కంచుకోటలో ప్రజాస్వామ్యం బతకడాన్ని చూసి ఓర్వలేక పులివెందుల ఎమ్మెల్యే జగన్ రెడ్డి ఒళ్లు బలిసి మాట్లాడుతున్నారు. ఇవే చివరి ఎన్నికలు అని, కృష్ణారామ అని జపం చేసుకోవాలని, నరకానికి పోతారని అంటూ చంద్రబాబుపై నోరు పారేసుకుంటున్నారు" అని సోమిరెడ్డి ఆరోపించారు. వైసీపీ పాలనలో సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో అరాచకాలు సృష్టించి, ప్రతిపక్షాలు నామినేషన్లు కూడా వేయలేని దుస్థితి కల్పించారని ఆయన గుర్తుచేశారు. చంద్రబాబు క్రమశిక్షణ, కష్టపడే తత్వానికి మారుపేరని, ఆయన రోజుకు 12 గంటలకు పైగా రాష్ట్ర భవిష్యత్తు కోసం పనిచేస్తారని సోమిరెడ్డి తెలిపారు. "రాముడు, కృష్ణుడు లోకకళ్యాణం కోసం తపించినట్లే, చంద్రబాబు కూడా నిత్యం ప్రజల కోసమే పోరాడుతున్నారు. అలాంటి వ్యక్తి పేరు పలికే అర్హత కూడా జగన్‌కు లేదు" అని ఆయన అన్నారు. లిక్కర్ స్కామ్‌పై సిట్ దర్యాప్తులో రోజుకో కొత్త విషయం బయటకు వస్తుండటంతో గందరగోళానికి గురైన జగన్, నోటిపై అదుపు కోల్పోతున్నారని విమర్శించారు. "రాజకీయాల్లోకి రావాలంటే తండ్రి చనిపోవాలి, సీఎం కావాలంటే చిన్నాన్న హత్యకు గురికావాలి... ఇదే జగన్మోహన్ రెడ్డి రాజకీయ వ్యూహం. ప్రజాసేవలో అపార అనుభవం ఉన్న చంద్రబాబు బ్యాక్ గ్రౌండ్ ఏమిటి? జగన్ బ్యాక్ గ్రౌండ్ ఏమిటి?" అని సోమిరెడ్డి ప్రశ్నించారు. జగన్ రెడ్డి, ఆయన అనుచరులు ఇకనైనా ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. ఒళ్లు బలిసిన వారి సంగతిని లోకేశ్ చూసుకుంటారని సోమిరెడ్డి వ్యాఖ్యానించారు.

# బాబు గురించి జగన్ ఇలా పవన్ అలా !



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ ముఖ్యమంత్రిగా నాలుగవ సారి ప్రమాణం చేసిన చంద్రబాబుది సుదీర్ఘమైన రాజకీయ అనుభవం. మరో మూడేళ్ళలో ఆయన రాజకీయ జీవితం అర్ధశతాబ్దం దాటుతుంది. ఎర్లీ సెవెంటీస్ నుంచి విద్యార్థి రాజకీయాల ద్వారా ఎంట్రీ ఇచ్చిన బాబు ఎంతో మంది సీనియర్లతో కలసి పనిచేశారు. చెన్నారెడ్డి మెచ్చిన నేతగా ఉన్నారు. ఆ తరువాత అంజయ్య, భవనం వెంకటరామ్, కోట్ల విజయభాస్కరరెడ్డి మంత్రివర్గాలలో కాంగ్రెస్ మంత్రిగా పనిచేశారు. అలాగే తెలుగుదేశంలో చేరి ఎన్టీఆర్ మంత్రివర్గంలో రెవిన్యూ ఆర్థిక శాఖలు చేపట్టారు.

**చిన్న వయసులో పెద్ద పదవి :**

కేవలం నాలుగున్నర దశాబ్దాల వయసులోనే చంద్రబాబు దక్షిణాదిన అతి పెద్ద రాష్ట్రంగా ఉన్న ఉమ్మడి ఏపీకి సీఎం గా బాధ్యతలు 1995లో చేపట్టారు. అది లగాయితూ ఏకంగా తొమ్మిదిన్నరేళ్ళ పాటు ఆయన ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఇక విభజన ఏపీలో కూడా 2014 నుంచి 2019 దాకా ఒకసారి, 2024లో మరోసారి గెలిచి ప్రస్తుతం ఇంకోసారి సీఎం గా బాబు ఉన్నారు ఇక చూస్తే బాబు వయసు ఇపుడు ఏడున్నర పదులు నిండి 76వ పడిలో ఉన్నారు.

**ఆఖరు ఎన్నికలేనా :**

ఇక వచ్చేసారి ఎన్నికలు 2029లో జరుగుతాయి. ఆ ఎన్నికల నాటికి చంద్రబాబు వయసు దాదాపుగా 80 ఏళ్ళ వరకూ ఉంటుంది. మరి ఆ ఏజ్ లో ఆయన మరోసారి సీఎం అభ్యర్థిగా ఉంటారా ఉండరా అన్నది కూటమి పార్టీలు నిర్ణయించుకోవాల్సిన విషయం. అయితే వైసీపీ అధినేత మాజీ సీఎం జగన్ మాత్రం చంద్రబాబుకు 2024 ఎన్నికలే ఆఖరు ఎన్నికలు అని అంటున్నారు. చంద్రబాబుకు ఈసారి వచ్చిన అవకాశాన్ని మంచి కోసం ఉపయోగించాలని సూచిస్తున్నారు. మార్పు తెచ్చుకో బాబూ అని కూడా విసురులు విసురుతున్నారు.

**పవన్ మాటల్లో చూస్తే :**

అయితే జగన్ చంద్రబాబు ఏజ్ ని చూస్తూ ఆయన రాజకీయంగా ఇక ముందు రోజులలో పెద్దగా క్రియాశీలకంగా ఉండరని భావిస్తున్నారులా ఉంది. అయితే జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాత్రం చంద్రబాబులో వయసుని చూడడం లేదు, ఆయన సత్తాను చూస్తున్నారు అని అంటున్నారు. బాబు సమర్థుడు అయిన పరిపాలకుడని అందువల్ల ఆయన మరో పదిహేనేళ్ళ పాటు ఏపీలో కూటమి ప్రభుత్వానికి సారథ్యం వహించాలని పదే పదే అనేక బహిరంగ సభలలోనే పవన్ ఇప్పటికే చెప్పి ఉన్నారు. అంటే బాబుకి ఏజ్ అన్నది ఒక టెక్నికల్ ఇష్యూ మాత్రమే అన్నది పవన్ భావన అని అంటున్నారు.

**రియాలిటీ ఏంటి :**


అయితే బాబులో ఎంత స్టామినా ఉన్నా రాజకీయాలు అన్నవి నిత్యం ఒత్తిళ్ళతో కూడుకున్నవి ఇక బాబు చూడని ముఖ్యమంత్రి పదవి కాదు. ఆయన 2029లో కూటమి సారథ్యం వహించడం ఎటూ ఖాయం. అయితే ఆ తర్వాత తిరిగి కూటమి పవర్ లోకి వస్తే బాబు సీఎం గా ఉంటారా అన్నదే ఒక చర్చగా ఉంది. లోకేష్ బాబు వారసుడిగా ఇప్పటికే రెడీగా ఉన్నారు. ఆయనను సీఎం గా చేయాలని యువతరం పార్టీలో గట్టిగా కోరుతోంది. ప్రస్తుతం 42 ఏళ్ళ వయసు ఉన్న లోకేష్ మరో నాలుగేళ్ళకు 46 ఏళ్ళ వారు అవుతారు. సరిగ్గా ఆ వయసులోనే చంద్రబాబు కూడా సీఎం అయ్యారు. దాంతో లోకేష్ రూపంలో బాబుకు అయితే ఎంతో కొంత ఒత్తిడి ఉండొచ్చు అన్న ప్రచారం కూడా ఉంది.

**ఇంతకీ ఎవరిది కరెక్ట్ :**

ఏపీ ఫ్యూచర్ పాలిటిక్స్ ని సరిగ్గా అంచనా ఎవరు వేస్తున్నారు అన్న చర్చ అయితే ఉంది. జగన్ వరకూ తీసుకుంటే బాబు పొలిటికల్ ఇన్నింగ్స్ దాదాపుగా అయిపోయాయనే గట్టిగా నమ్ముతున్నారు. బాబు బలమైన ప్రత్యర్థి గా ఆయన బయటకు చెప్పకపోయినా లోలోపల అయినా అంగీకరిస్తారు అంటారు. బాబు కనుక తప్పుకుంటే ఏపీ రాజకీయాల్లో జగన్ కి తిరుగులేదని వైసీపీ వర్గాలు కూడా భావిస్తాయని చెబుతారు. ఇక లోకేష్ పవన్ ఈ ఇద్దరూ కూటమిలో కాబోయే సీఎంలుగా ప్రచారంలో ఉన్న వారు.

అయితే లోకేష్ కే ఎక్కువ చాన్స్ వచ్చే ఎన్నికల్లో కూటమి గెలిస్తే ఉంటుంది అని అంటున్నారు. అదే జరిగితే అపుడు జనసేన పవన్ పాలిటిక్స్ ఎలా ఉంటుందో తెలియదు. ఇక వైసీపీకి ఒక అడ్వాంటేజ్ ఏంటి అంటే 2029లో ఆరు నూరు అయినా గెలుస్తామని నమ్మకం ఉంది. కూటమిలో లుకలుకలే తమకు శ్రీరామ రక్ష అన్న ఆలోచన కూడా ఉంది అంటారు. అందుకే బాబు మీదనే గురి పెట్టి మరీ విమర్శలు సంధిస్తున్నారు అని అంటారు. చూడాలి మరి ఈ అంచనాలు ప్రచారాలు ఏ మేరకు నిజం అవుతాయో.

# అమితాబ్ షోలో 'ఆపరేషన్ సింధూర్' నాయికలు.. స్ట్రీమింగ్ అప్పుడే?



**హైదరాబాద్ పెన్ పవర్:** బాలీవుడ్ ఇండస్ట్రీలో అమితాబ్ బచ్చన్ అంటే ఎంత క్రేజ్ ఉంటుందో మనందరికీ తెలుసు. ఆ క్రేజ్ కు తగ్గట్టే ఆయన చేసే షో 'కౌన్ బనేగా కరోడ్ పతి'. అయితే ఈ షో 17వ సీజన్ కోసం చాలామంది స్పెషల్ గెస్ట్ లను పిలిచారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ ఎపిసోడ్ టెలికాస్ట్ అవ్వనుంది. అయితే ఈ సందర్భంగా దేశం కోసం పోరాడి, గెలిచిన నిజమైన హీరోలను మనకు చూపించబోతున్నారు. ఇంతకీ వారు ఎవరయ్యా అంటే..ఆడ పులులు.. "ఆపరేషన్ సింధూర్" తో అద్భుతాలు సృష్టించిన ముగ్గురు మహిళ అధికారులు.. వీరిలో వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్, కల్నల్ సోషియో ఖురేషి, కమాండర్ ప్రేరణ డియోస్తలి రాబోతున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ షోలో వారు పాల్గొంటారని తెలుస్తోంది. దీనికి సంబంధించిన ఎపిసోడ్ ప్రోమో తాజాగా రిలీజ్ అయింది. ఈ ప్రోమోలో ఈ ముగ్గురు అధికారులు ఆపరేషన్ సింధూర్ లో ఎదుర్కొన్న ఆసక్తికర విషయాల గురించి తెలియజేశారు. అయితే ఆపరేషన్ సింధూర్ గురించి కల్నల్ ఖురేషి మాట్లాడుతూ.. "ఆపరేషన్ సింధూర్ అనేది తప్పనిసరి చర్య అన్నారు". ఆ సమయంలో అది ఎందుకు అవసరమో కూడా తెలియజేశారు. వ్యోమికా సింగ్ , ప్రేరణ కూడా ఇదే విషయాన్ని బయట పెట్టారు. పాకిస్తాన్ ఈ విధంగా పదే పదే భారతదేశాన్ని ఇబ్బంది పెడుతోంది. కాబట్టి ఆపరేషన్ సింధూర్ వంటి యుద్ధం తప్పనిసరి అయిందని అన్నారు. ఆపరేషన్ సింధూర్ ప్రోగ్రామ్ అనేది కేవలం 25 నిమిషాల్లో పూర్తయిందని వ్యోమికా సింగ్ తెలియజేశారు. ఈ టైంలోనే అనుకున్న లక్ష్యాలను ఛేదించామని కమాండర్ ప్రేరణ డియోస్తలి అన్నారు. ఈ విధంగా ఈ ముగ్గురు రియల్ రాణి రుద్రమదేవిలు ఆపరేషన్ సింధూర్ గురించి అద్భుతంగా వర్ణించినట్టు ఈ ప్రోమోలో చూపించారు. అయితే ఈ ప్రోమో ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవ్వడంతో పూర్తి షో కోసం ఎంతగానో ఎదురు చూస్తున్నామని ప్రోమో చూసిన నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ ఫుల్ ఎపిసోడ్ వస్తోంది. అయితే విడుదలైన ప్రోమో పై కొన్ని విమర్శలు కూడా వస్తున్నాయి. ఎందుకంటే ప్రోటోకాల్ ని ఈ ముగ్గురు అధికారులు ఉల్లంఘించారని అంటున్నారు. అంతేకాదు ఇప్పటివరకు చాలా దేశాల్లో చాలా యుద్ధాలు జరిగాయి. కానీ ఇలా ఏ సైనిక అధికారి కూడా యూనిఫాం ధరించి ఎంటర్టైన్మెంట్ షోలకు వెళ్లలేదు. మొదటిసారి వీళ్లు ఈ దేశంలో షో కి యూనిఫాం వేసుకొని వచ్చారు.. భారతదేశ సాయుధ దళాలకు ఎంతో గౌరవం ఉంది. అలాంటి గౌరవ మర్యాదల్ని కొన్ని రాజకీయ పార్టీలు తమ స్వార్థ రాజకీయాల కోసం వాడుకుంటున్నాయి అంటూ ఈ అధికారులు చేసిన పనిపై మండి పడుతున్నారు. యూనిఫామ్ వేసుకుని ఎంటర్టైన్మెంట్ షోకి ఎలా వస్తారంటూ సోషల్ మీడియా వేదికగా కొంతమంది ప్రశ్నిస్తున్నారు.

# పార్లమెంట్ సెషన్ : వాయిదాలు తప్ప చర్చలేవీ ?

**హైదరాబాద్ పెన్ పవర్:** దేశంలో అత్యున్నత చట్ట సభలుగా లోక్ సభ రాజ్యసభ ఉన్నాయి. ఇక వర్షాకాల సమావేశాలు జూలై 21 నుంచి ప్రారంభం అయ్యాయి. ఆగస్టు 21 వరకూ ఈ సమావేశాలు జరుగుతాయని షెడ్యూల్ ఖరారు చేశారు. అయితే ఈసారి చూస్తే కనుక అత్యధిక పని దినాలలో వాయిదాల పర్వమే సాగుతూ వస్తోంది. ఆపరేషన్ సింధూర్ మీద మాత్రమే చర్చ వాడిగా వేడిగా సాగింది.

**ప్రతీ రోజూ అంతేనా :**

ఇక దాదాపుగా చూస్తే ప్రతీ రోజూ పార్లమెంట్ సమావేశం అవుతూనే విపక్షాలు నిరసనల మధ్య ప్రభుత్వం కొన్ని బిల్లులను ప్రతిపాదించడం ఆ తరువాత సభ వాయిదా పడుతున్న దశలో పెద్దగా చర్చ లేకుండా వాటిని ఆమోదించడం జరుగుతోంది. పార్లమెంట్ సమావేశాలు ఈ విధంగా వర్షార్పణం అయ్యాయని అంటున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ కానీ విపక్ష నేత రాహుల్ గాంధీ కానీ సభలో ఎక్కువగా కనిపించడం లేదు. అలాగే ఇతర సభ్యులకు కూడా ఆసక్తి తగ్గిపోతోంది అని అంటున్నారు.

**ఒకే ఒక ఇష్యూతో :**

విపక్షాలు అన్నీ ఒకే ఒక అంశం మీదనే ఈసారి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో పట్టుబడుతున్నాయి. బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఆఫ్ ఎలక్టోరల్ రోల్స్ అంశంపైనే లోక్‌సభ రాజ్యసభ చర్చ జరగాలని డిమాండ్ చేస్తున్నాయి. అయితే దానికి ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో ప్రతీ రోజూ దాదాపుగా సభ అనేకసార్లు వాయిదా పడుతూ చివరికి మరుసటి రోజుకు వాయిదాగా సాగుతోంది. ఇక మంగళవారం లోక్‌సభ మూడుసార్లు వాయిదా పడగా, రాజ్యసభ రెండుసార్లు వాయిదా పడింది, చివరికి ఈ నెల 18వ తేదీకి ఉభయ సభలు వాయిదా పడడం విశేషం.

**చర్చలో పాల్గొనాలంటూ :**

ఇదిలా ఉంటే పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు ప్రతిపక్ష ఎంపీలు స్పీకర్ కుర్చీ వైపు కాగితం విసిరినందుకు



వారి ప్రవర్తనను ఖండించారు. ఇది సభా మర్యాదకు విరుద్ధమని ఆయన అన్నారు. దేశ ప్రజలు చర్చలో పాల్గొనడానికి ప్రతిపక్ష ఎంపీలను పంపినందున వారు చర్చలో పాల్గొనాలని ఆయన అన్నారు. నిరసన తెలుపుతున్న ఎంపీల ప్రవర్తనపై స్పీకర్ సైతం అసంతృప్తి వ్యక్తం చేశారు, వారు సభా మర్యాదను దెబ్బతీస్తున్నారని అన్నారు.

**కీలక బిల్లులు ఆమోదం :**

ప్రభుత్వం పార్లమెంట్ ని సమావేశపరచేది బిల్లులను ఆమోదించుకోవడానికి. అయితే విపక్షం ఆ బిల్లులల్లో లోటు పాట్లను చర్చించి సరైన సూచనలు చేసి బిల్లులు జనాలకు పూర్తిగా ఉపయోగపడేలా చూడాల్సి ఉంది. కానీ విపక్ష సభ్యులు వాకౌట్ చేస్తున్నారు. దాంతో ఏ చర్చ లేకుండానే బిల్లులు ఆమోదం పొందుతున్నాయి. అలా మంగళవారం లోక్‌సభ జాతీయ క్రీడా పాలన బిల్లు, 2025, జాతీయ డోపింగ్ నిరోధక సవరణ బిల్లు, 2025లను ఆమోదించింది. ఆదాయపు పన్ను బిల్లు, 2025 పన్ను చట్టాలు సవరణ బిల్లు, 2025లను కూడా సభ ఆమోదించింది.

**గతంలో సాగు చట్టాలతో :**

ఇక వెనక్కి వెళ్తే సాగు చట్టాలను రద్దు చేయాలని కోరుతూ విపక్షాలు డిమాండ్ చేస్తూ వచ్చాయి. వరసగా మూడు సెషన్ల సభా కాలాన్ని చర్చలు లేకుండానే ముగించేశారు. ఇలా పార్లమెంట్ సెషన్ కి ముందు జాతీయ అంశాలు అనేకం ఉన్నా కొన్ని మాత్రమే విపక్షాలు తీసుకుంటున్నాయన్న విమర్శలు ఉన్నాయి. దాంతో మిగిలినవి మరుగున పడిపోతున్నాయి అంటున్నారు.

**సజావుగా జరుగుతున్నాయా :**

మోడీ ప్రధాని అయ్యాక 2014 నుంచి 2019 మధ్యలో కొంత సజావుగా పార్లమెంట్ సమావేశాలు జరిగాయని అంటున్నారు. ఆ తరువాత రెండోసారి మోడీ అధికారం చేపట్టినప్పటి నుంచి పార్లమెంట్ సెషన్లలో అధికార పక్షం వర్సెస్ విపక్షంగా మారిపోతూ సభా కాలాన్ని హరించేస్తున్నాయని అంటున్నారు. ఇక్కడ విపక్షం లేవనెత్తే అంశాలలో సహేతుకత ఉంటే వాటిని అధికార పక్షం స్వీకరించి చర్చకు రావాలి. అలాగే విపక్షం సైతం ఒకే ఇష్యూకే కట్టుబడిపోకుండా విశాలమైన దేశ ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని కీలక బిల్లుల మీద చర్చ జరపాలని ప్రజాస్వామ్య ప్రియులు కోరుతున్నారు. శీతాకాల సమావేశాలలో అయినా ఆ వైఖరి కనబడాలని అంతా ఆశిస్తున్నారు.

## 5 బంతుల్లో 26 పరుగులు..
## హండ్రెడ్ లీగ్‌లో రషీద్ ఖాన్ అత్యంత చెత్త బౌలింగ్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 క్రికెట్ లో ఆఫ్ఘనిస్తాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ వన్ ఆఫ్ ది టాప్ బౌలర్లలో ఒకడు. ఏళ్ళు గడుస్తున్నా ఈ మిస్టరీ స్పిన్నర్ ను డీకోడ్ చేయడం బ్యాటర్లకు పెద్ద సమస్యగా మారింది. అందుకే ప్రపంచంలో ఎక్కడ క్రికెట్ లీగ్ జరిగినా ఈ ఆఫ్ఘన్ స్పిన్నర్ ను పోటీ పడి మరీ తీసుకుంటారు. దశాబ్ద కాలానికి పైగా టీ20 క్రికెట్ లో తనదైన మార్క్ చూపిస్తు వస్తున్నాడు. ఇప్పటికీ రషీద్ ఖాన్ స్పిన్ బ్యాటర్లకు ఒక సవాలే. తన స్పిన్ మాయాజాలంతో టీ20 క్రికెట్ లో ఎన్నో రికార్డులు తన పేరిట లిఖించుకున్న రషీద్ ఖాన్ కు ఈ ఏడాది (2025) కష్టకాలం కొనసాగుతోంది. లీగ్ ఏదైనా రషీద్ ను అలవోకగా ఆడేస్తున్నారు. ప్రస్తుతం ఇంగ్లాండ్ లో జరుగుతున్న హండ్రెడ్ లీగ్ లో రషీద్ తన పేలవ ఫామ్ కొనసాగిస్తున్నాడు. మంగళవారం (ఆగస్టు 12) బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్‌లో జరిగిన హండ్రెడ్ లీగ్ మ్యాచ్ లో రషీద్ ఖాన్ ఘోరంగా విఫలమయ్యాడు. ఓవల్ ఇన్విన్సిబుల్స్ తరపున ఆడుతున్న రషీద్ ఖాన్ తన 20 బంతుల్లో ఏకంగా 59 పరుగులు సమర్పించుకున్నాడు. బర్మింగ్ హెూమ్ హామ్ ఫీనిక్స్ లియామ్ లివింగ్‌స్టోన్ రషీద్ వేసిన ఓవర్లో 5 బంతుల్లోనే మూడు సిక్సర్లు, రెండు ఫోర్లతో 26 పరుగులు రాబట్టాడు. రషీద్ తన మొదటి ఐదు బంతుల్లో 8 పరుగులు ఇచ్చాడు. ఆ తర్వాత 15 బంతుల్లో 51 పరుగులు బాదారు.

రషీద్ ఖాన్ టీ20 చరిత్రలో ఇవే అత్యంత చెత్త గణాంకాలు. ఐపీఎల్ 2018లో పంజాబ్ కింగ్స్ పై సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున ఆడిన ఈ ఆఫ్ఘన్ స్పిన్నర్ 55 పరుగుల తన చెత్త రికార్డును బ్రేక్ చేసుకున్నాడు. హండ్రెడ్ లీగ్ లో కూడా అత్యధిక పరుగులు ఇచ్చిన ఆటగాడిగా నిలిచాడు. 26 ఏళ్ల రషీద్ ఖాన్ ఇటీవలే జరిగిన ఐపీఎల్ సీజన్ 2025లో పెద్దగా రాణించలేదు. 15 మ్యాచ్‌లలో 57.11 సగటుతో 9 వికెట్లు మాత్రమే పడగొట్టగలిగాడు. ఐపీఎల్ లో విఫలమైనా హండ్రెడ్ లీగ్ లో అదే పేలవ ఆట తీరును కొనసాగిస్తున్నాడు. ఇదే టోర్నీలో టీ20 ఫార్మాట్ లో 650 వికెట్లు తీసిన తొలి ఆటగాడిగా రషీద్ ఖాన్ చరిత్ర పుటల్లో తన పేరును లిఖించుకున్నాడు.

ఈ మ్యాచ్ విషయానికి వస్తే మొదట బ్యాటింగ్ చేసిన ఓవల్ ఇన్విన్సిబుల్స్ 100 బంతుల్లో 180 పరుగుల

భారీ స్కోరును నమోదు చేసింది. డోనోవన్ ఫెర్రీరా (29 బంతుల్లో 63), జోర్డాన్ కాక్స్ (30 బంతుల్లో 44) మెరుపులు మెరిపించి జట్టుకు భారీ స్కోర్ అందించారు. ట్రెంట్ బౌల్ట్ (2/20), ఆడమ్ మిల్నే (2/28) చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఆ తర్వాత బర్మింగ్‌హామ్ ఫీనిక్స్ 98 బంతుల్లో 181 పరుగుల లక్ష్యాన్ని ఛేజ్ చేసి గెలిచింది. లివింగ్‌స్టోన్ 69లి (27) మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడి జట్టుకు విజయాన్ని అందించాడు.

## దేశ సైనికుల త్యాగాలు ఏ క్రికెట్ కంటే ఎక్కువ కాదు.. బీసీసీపై మాజీ స్పిన్నర్ ఫైర్



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ లీగ్ లో భాగంగా పాకిస్తాన్ తో జరగాల్సిన సెమీ ఫైనల్ మ్యాచ్ ను ఇండియా ఛాంపియన్స్ రద్దు చేసుకున్న సంగతి తెలిసిందే. రెండు దేశాల మధ్య కొనసాగుతున్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతల కారణంగా చాలామంది భారత ఆటగాళ్లు పాకిస్థాన్ తో మ్యాచ్ బహిష్కరించాలని కోరడంతో మ్యాచ్ రద్దయింది. అంతకముందు పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా శిఖర్ ధవన్ సహా పలువురు ఇండియా వెటరన్ ప్లేయర్లు పాకిస్థాన్ తో లీగ్ మ్యాచ్ ఆడేందుకు నిరాకరించగా.. సెమీ ఫైనల్ కూడా ఆడకుండా టోర్నీ నుంచి నిష్క్రమించింది. దీంతో పాక్ సెమీస్ కు వెళ్లగా టీమిండియా మ్యాచ్ ఆడకుండానే ఇంటిదారి పట్టింది. ఇండియా ఛాంపియన్స్ తీసుకున్న ఈ నిర్ణయం పట్ల దేశామంతా వీరిని గౌరవించింది. ఆట కంటే దేశమే ముఖ్యమనే వీరి నిర్ణయంపై ప్రశంసలు కురిపించారు. అయితే లెజెండ్స్ లీగ్ రద్దు చేసుకున్నా.. అంతర్జాతీయ క్రికెట్ లో పాకిస్థాన్ తో తలపడేందుకు టీమిండియా బీసీసీఐ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దుబాయ్ వేదికగా పాకిస్తా, ఇండియా ఆసియా కప్ లో ఆడబోతున్నారు. బీసీసీఐ తీసుకున్న ఈ నిర్ణయాన్ని భారత మాజీ స్పిన్నర్ హర్భజన్ తప్పుబట్టారు. బీసీసీఐ వైఖరిని తప్పుపడుతూ మ్యాచ్ నిర్వహించకుండా ఉండాల్సిందని చెప్పుకొచ్చాడు. ఆసియా కప్ 2025 లో పాకిస్తాన్‌తో క్రికెట్ మ్యాచ్ నిర్వహించాలనే బీసీసీఐ నిర్ణయాన్ని హర్భజన్ సింగ్ తీవ్రంగా విమర్శించాడు. జాతీయ ఉద్రిక్తతల మధ్య భారత సైనికులు చేసిన అపారమైన త్యాగాలతో పోలిస్తే క్రికెట్ పోటీ చాలా తక్కువ అని బీసీసీపై ఫైరయ్యాడు. ఏ వ్యక్తి దేశం కంటే పెద్దవాడు కాదని.. పాకిస్థాన్ మ్యాచ్ లు పూర్తిగా బహిష్కరించాలని ఈ వెటరన్ క్రికెటర్ చెప్పుకొచ్చాడు. ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ (%ఔజూ%) లీగ్ లో 2025 లో పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌ను భారత ఆటగాళ్ళు బహిష్కరించిన కొన్ని వారాల తర్వాత హర్భజన్ చేసిన ఈ వ్యాఖ్యలు చర్చనీయాంశమవుతున్నాయి. ఆసియా కప్ 2025 సెప్టెంబర్ 9 నుంచి 28 వరకు జరగనుంది. ఈ టోర్నీ అన్ని మ్యాచ్ లు దుబాయ్, అబుదాబిలో జరగనున్నాయి. టీ20 ఫార్మాట్ లో జరగనున్న ఈ టోర్నమెంట్ ప్రారంభ మ్యాచ్ ఆఫ్ఘనిస్తాన్, హాంకాంగ్ మధ్య అబుదాబిలో జరుగుతుంది. చిరకాల ప్రత్యర్థులు ఇండియా, పాకిస్థాన్ మ్యాచ్ సెప్టెంబర్ 14న దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరుగుతుంది. ఇటీవలే జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీలో కూడా దాయాధి జట్లు దుబాయ్ వేదికగానే లీగ్ మ్యాచ్ ఆడడం విశేషం. ఫైనల్ సెప్టెంబర్ 28న దుబాయ్‌లో జరుగుతుంది.

## వన్డే ర్యాంకింగ్స్‌లో దుమ్ములేపారుగా: టాప్-4లో రోహిత్, కోహ్లీ.. అగ్రస్థానంలోనే గిల్




**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలపై గత కొంతకాలంగా వన్డే రిటైర్మెంట్ ప్రచారం జరుగుతోంది. వీరిద్దరి వన్డే కెరీర్ ఇక ముగిసిందని.. జట్టుకు వీరి అవసరం ఇక లేదని.. బీసీసీఐ యంగ్ ఇండియా వైపు అడుగులు వేస్తోందని వార్తలు వచ్చాయి. అయితే తాజాగా రోకో జోడీ వన్డే ర్యాంకింగ్స్ లో చాటారు. ఐసీసీ బుధవారం (ఆగస్టు 13) రిలీజ్ చేసిన ర్యాంకింగ్స్ లో రోహిత్ రెండో స్థానానికి చేరుకున్నాడు. మరోవైపు విరాట్ కోహ్లీ (736) నాలుగో స్థానంలో నిలిచాడు. ఇటీవలే వెస్టిండీస్ తో జరిగిన వన్డే సిరీస్ లో పాకిస్థాన్ స్టార్ బ్యాటర్ బాబర్ అజామ్ ఘోరంగా విఫలం కావడంతో మూడో స్థానికి పడిపోయాడు. బాబర్ (751) విఫలం కావడంతో రోహిత్ (756) రెండో ర్యాంక్ కు చేరుకున్నాడు. తొలి స్థానంలో టీమిండియా ఓపెనర్ శుభమాన్ గిల్ (784) కొనసాగుతున్నాడు. టాప్ -4 ఏకంగా ముగ్గురు టీమిండియా క్రికెటర్లు ఉండడం విశేషం. డారిల్ మిచెల్ టాప్-5 బ్యాటర్ల జాబితాలో చోటు సంపాదించాడు. ఫిబ్రవరిలో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీలో కోహ్లీ, రోహిత్, గిల్ అద్భుతంగా రాణించారు. ఇతర భారత క్రికెటర్లలో శ్రేయాస్ అయ్యర్ 8 వ ర్యాంక్ లో నిలిచాడు. వికెట్ కీపర్ బ్యాటర్ రాహుల్ 15 ర్యాంక్ లో కొనసాగుతున్నాడు. టీ20 ర్యాంకింగ్స్ లో కూడా టాప్-2 లో టీమిండియా ప్లేయర్స్ కావడం విశేషం. తొలి స్థానంలో అభిషేక్ శర్మ, రెండో స్థానంలో తిలక్ వర్మ నిలిచారు. బౌలింగ్ విషయానికి వస్తే శ్రీలంక స్పిన్నర్ మహీష్ తీక్షణ 671 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. టీమిండియా బౌలర్లలో కుల్దీప్ యాదవ్ రెండో స్థానంలో ఉండగా.. జడేజా 9 ర్యాంక్ లో నిలిచాడు. ఫాస్ట్ బౌలర్లు మహమ్మద్ షమీ 14 వ స్థానంలో.. సిరాజ్ 15 వ స్థానంలో కొనసాగుతున్నారు. ఇటీవలే పాకిస్తాన్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల్లో నాలుగు వికెట్లు తీసిన వెస్టిండీస్ స్పిన్నర్ గుడాకేష్ మోతీ ఐదు స్థానాలు ఎగబాకి 12వ స్థానానికి చేరుకోవడం హైలెట్ గా నిలిచింది. ఆల్ రౌండర్ విభాగానికి వస్తే జడేజా ఒక్కడే టీమిండియా నుంచి 10 స్థానంలో ఉన్నాడు. ఆఫ్ఘనిస్తాన్ ఆల్ రౌండర్ ఒమర్జాయ్ అగ్ర స్థానంలో ఉన్నాడు.



సాంచి రాయ్ తన లేటెస్ట్ లుక్‌లో గ్రేస్‌తో మెరుస్తోంది

## ఆ ముగ్గురు పాలిట మెగాస్టార్ ఆపద్బాంధవుడు!

సీనియర్ బ్యూటీలు త్రిష, నయనతార కెరీర్ ఇప్పుడంత స్పీడ్ గా లేదు. సెలక్టివ్ గా సినిమాలు చేస్తు న్నారు. హీరోల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. హీరోతో పాటు కథ కూడా పక్కాగా ఉంటేనే కమిట్ అవుతున్నారు. లేదంటే వచ్చిన అవకాశాలే వదులుకుంటున్నారు. ఈ క్రమంలో రిలీజ్ లకు గ్యాప్ ఏర్పడుతుంది. త్రిష గత చిత్రం - థగ్ లైఫ్ - బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్గా నమోదైంది. దానికంటే ముందు రిలీజ్ అయిన - గుడ్ బ్యాడ్ అగ్లీ - పర్వాలేదనిపించినా ఆ సక్సెస్ ని - థగ్ లైఫ్ - తో కొనసాగించ లేకపోయింది.



**వరుస వైఫల్యాలు:**

దీంతో చేతిలో ఉన్న -విశ్వంభర - చిత్రం కీలకంగా మారింది. ఇందులో మెగాస్టార్ చిరంజీవికి జోడీగా నటిస్తోన్న సంగతి తెలిసిందే. మరో సినిమా -కురుప్పు- కూడా చేస్తోంది. కానీ భారీ అంచనాలు మాత్రం చిరంజీవి చిత్రంపైనే పెట్టుకుంది. -విశ్వంభర- సక్సెస్ తో తెలుగులో బిజీ అవ్వాలని ఆశపడుతోంది. మరోవైపు లేడీ సూపర్ స్టార్ గా నీరాజనాలు అందుకుంటోన్న నయనతార కూడా వరుస పెయిల్యూర్స్ లో ఉంది. -జవాన్- తర్వాత చేసిన ప్రయత్నాలేవి ఫలించలేదు. సమ్మర్ లో రిలీజ్ అయిన-టెస్ట్- కూడా ఫెయిలైంది.

**157పైనే ఆశలన్నీ:**

దీంతో ఈ ఏడాది మరో రిలీజ్ కూడా చేతిలో లేదు. కొత్త సినిమాలు చాలా చేస్తోంది. కానీ అవన్నీ రిలీజ్ అయ్యేది వచ్చే ఏడాదే. అందులో చిరంజీవి 157వ చిత్రం కీలకంగా మారింది. ఇందులో చిరుకు జోడీగా నటిస్తోన్న సంగతి తెలిసిందే. 2026 రిలీజ్ లు అన్నింకంటే ఎక్కువగా నయన్ పోకస్ చేసిన చిత్రం కూడా ఇదే. అందుకే సినిమా కోసం తన ప్రమోషన్ నిబంధనలు సైతం పక్కన బెట్టి ప్రచార బరిలో నిలిచింది.

**చిరంజీవి సక్సెస్ కీలకం:**

మరోవైపు బాలీవుడ్ నటి మౌనీ రాయ్ కూడా చిరంజీవి సినిమాపైనే ఆశలు పెట్టుకుంది. విశ్వంభర-లో అమ్మడు ఐటం పాటలో నటిస్తోన్న సంగతి తెలిసిందే. ఎంతో మంది భామల్ని పరిశీలించి చివరిగా మౌనీ రాయ్ ని తీసుకున్నారు. ఆమెకు కూడా సరైన అవకాశాలు లేని సమయంలో వచ్చిన గొప్ప ఛాన్స్ ఇది. ఈ పాటతో సక్సెస్ అందుకుని నటిగా, నర్తకిగా బిజీ అవ్వాలనే ప్లాన్ లో ఉంది. మరి ఈ ముగ్గురికి మెగాస్టార్ ఎలాంటి సక్సెస్ ఇస్తారో చూడాలి.

రెయిన్‌బో హార్ట్ మరియు సాల్ట్ హెయిర్‌తో కృతి సనన్ వైబ్రెంట్ వెకేషన్ వైబ్స్



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com